

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 06 హైదరాబాద్ 2015 అక్టోబర్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# 47వ అమరతిధి

అవతారుని 47వ అమరతిధి రెండున్నర రోజులపాటు 2016 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కాగా, 2016 జనవరి 31వ తేదీ అత్యంత ప్రధానమైన రోజు. ఆ రోజున అవతార్ మెహెర్‌బాబా సమాధి ఎదురుగా మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకు బాబా ప్రేమికులందరూ మౌనం పాటించే సమయమని ప్రత్యేకంగా గుర్తించాలి.

## వసతి సదుపాయం

మెహెరాబాద్‌లో వసతి సౌకర్యం కోరుకునే యాత్రికులు ఒక్కొక్కరికి రూ. 50/- చొప్పున నగదును "అమరతిధి డొనేషన్స్" పేరిట పోస్టల్ మనీ ఆర్డరు లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మెహెర్‌బాబా ట్రస్టు అడ్రస్సు - 'అమరతిధి డొనేషన్స్", అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర - 414 001 పంపాలి. ఇందుకు ఆఖరు తేది 2016 జనవరి 7. ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి సొమ్ము వసూలు చేయరు. ఎలక్ట్రానిక్ మనీఆర్డర్ ద్వారా మీరు "అమరతిధి డొనేషన్స్" పంపుతున్న ఎడల మీ పేరు ప్రక్కనే ఎంత మంది పురుషులు / స్త్రీలు తెలియచేయాలని కోరుతున్నారు. ముందుగా నగదు పంపలేని పక్షంలో 2016 జనవరి 30, 31 తేదీల్లో దిగువ మెహెరాబాద్‌లోని విచారణ కౌంటర్ల వద్ద ఒక్కొక్కరికి రూ. 100/- చొప్పున చెల్లించవలసి ఉంటుందని ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పరుపులు:** పరుపుల కాంట్రాక్టరు రెండు రోజుల బసకు ఒక్కొక్క పరుపుకు రూ. 50/- చొప్పున అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం ముందుగా -శ్రీమతి ఉషా.అశోక్ సేర్, బంగ్లా నెం. 93, ఉషాకాల్, ఆనంద్‌నగర్, గుల్‌మొహర్ రోడ్, సావేడి, అహ్మద్‌నగర్, మహరాష్ట్ర - 414 003 కు తగిన నగదును మనీ ఆర్డర్ ద్వారా పంపవలెను.

భజనలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదల్చుకునేవారు, శ్రీ మెహెర్‌నాథ్ బి.కల్చూరీ, ట్రస్టీ, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్‌నగర్, మహరాష్ట్ర - 414 001, అనే చిరునామాకు 2015 డిసెంబరు 31వ తేదీ లోగా తెలియజేయాల్సిందిగా కోరుతున్నారు.

**అమరతిధికి వెళ్ళడానికి, అవతారుని ఆశీశ్శులు అందుకోవడానికి నేటి నుండే సిద్ధంకండి!**

## బాబా సందేశం

**మనస్సు అనేక ఆలోచనలకు, ఊహలకు కేంద్రం.**

**మనోనాశ్ అయితే కానీ భగవదైక్యం సాధ్యం కాదు.**

**Union is possible only after the death of thoughts and imagination, the mind must die.**

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-6555 3218**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. హఫీజ్ 6-7
3. మెహెరాబాద్ సహవాస్ 8
4. హిందీ సహవాస్ 9-17
5. మా మాటలు 18
6. ఠాకూర్ 19
7. లార్డ్ మెహెర్ 20-31
8. అవతార్ చాలీసా 32
9. ఐవీ ఒనైటా డ్యూస్ 33-37
10. ప్రార్థనలు

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# పూరీ,రాంచీ,కోల్‌కత్తాలకు

## 2016 ఫిబ్రవరి 11-14

మెహెర్‌బాబా 1916 నుండి 1950వ దశకం దాకా ఒరిస్సాలోని పూరీ, జార్కంఢ్ రాష్ట్రంలోని రాంచి, కోల్‌కత్తా నగరాలను అనేకమార్లు సందర్శించారు. ఆయా నగరాలలో బాబా మస్తులతో తన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. బాబావారి పాదస్పర్శతో పునీతమైన **ఈ నగరాలను, 2016 ఫిబ్రవరి 11 నుండి 14 దాకా నాల్గు రోజులపాటు పర్యటించాలని, ఆయా ప్రాంతాలలో మెహెర్ ప్రేమిక సహవాస్‌లో ఆనాటి సంగతులు స్మరించుకోవాలని ఒక ప్రత్యేక యాత్ర ఏర్పాటు చేసినట్లు డా. నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.** ఈ యాత్రలో సుమారు 150 మందికి మాత్రం భోజన, బస ఏర్పాటు చేయగల అవకాశం తమకు వుందని, కాబట్టి ఎవరు ముందువస్తే వారి పేర్లు, 150 మందికి మాత్రం లోబడి నమోదు చేసుకోవాలని నిర్ణయించినట్లు డాక్టర్ ప్రసాద్ **(94 40 602754)**తెలిపారు. ఈ యాత్రలో భోజన, బస ఏర్పాటు కయ్యే ఖర్చు నమోదు చేసుకున్న సభ్యులకు విడిగా తెలియజేస్తామన్నారు. రైలు రిజర్వేషన్లు ఎవరికివారుగా చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాల కోసం శ్రీ సత్తయ్య (92475 83467), హైదరాబాద్ సంప్రదించగలరు.

# చీపురుపల్లి

చీపురుపల్లి బాబా సెంటర్ 26వ వార్షికోత్సవం నవంబరు 1న నిర్వహిస్తున్నట్లు శ్రీ మహేశ్వరరావు (9493473034) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరారు.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

సంపాదకీయం

# ఖోజాగూడా

**హైదరాబాద్ అంటే తనకెంతో ఇష్టం అన్నారు మెహెర్‌బాబా.** ఆధ్యాత్మికంగా ఈ నగరం భాగ్యనగరమేనన్నారు. ఈ అదృష్టం ఎన్నో యుగాలుగా సంప్రాప్తించిందన్నారు. 1951 అక్టోబరు 15 నుండి 24 దాకా **హైదరాబాద్**లోని ఖోజాగూడ కొండపై వున్న చిన్న గుహలో మెహెర్‌బాబా **ఏకాంతవాసం – మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైందన్నారు. మనోనాశ్ అంటే ఏమిటో బాబా చాలా వివరంగా చెప్పారు. మనస్సు సంస్కారాల పుట్ట. అహంకారానికీ, మమకారానికీ మనస్సు పదునుపెడ్తుంది. ఏమీ పట్టనట్లు ఏ పనినైనా నిర్లిప్తతతో చేయడం, మనసావాచా భగవంతుని ప్రేమించడం, ఆరాధించడం ద్వారా పాత సంస్కారాలు ఖర్చవుతాయి. కొత్త సంస్కారాలు దరిరావన్నారు. శరీరం వున్నంతకాలం మనస్సు వుంటుంది. దీంతో క్రొత్త సంస్కారాలు ప్రోది అవుతుంటాయి. ఇదొక విషవలయం. ఇందులోంచి బయటపడాలంటే బాబా ఓ తేలు కథ చెప్పారు. తేలు ఏం చేస్తుంది. కొండెంతో కాటేస్తుంది. మరి ఆ కొండెను కోసేస్తే ఏమవుతుంది? తేలు కుట్టినా నొప్పి పుట్టదు. ఈ పనే చేయమన్నారు. ఏ పని చేసినా ఫలితం ఆశించ వద్దన్నారు. ఏపని చేసినా, భగవంతుడిపై భారం వేసి జీవించమన్నారు. తద్వారా ఎలాంటి సంస్కారాలు అంటవన్నారు. కానీ ఇది చాలా కష్టం అని బాబా స్పష్టం చేశారు. భగవంతుని దయ వుంటేనే మనోనాశ్ సాధ్యమౌతుందన్నారు. నిస్వార్థ సేవ, ధ్యానం, భక్తి ఇలా ఏ మార్గమైనా మనోనాశ్‌కే దారితీస్తుంది. దేముడిని అంతటా చూడగలుగుతుంది. మనమందరం ఒక్కటేనన్న భావం జనిస్తుంది. మనస్సు మనల్ని తప్పుదారిపట్టిస్తుంటుంది. ఆ మనస్సే పోతే, ఈ శరీరానికి ఏమీ పట్టదు. ఈ శరీరంతో నాకు సంబంధం లేదనిపిస్తుంది. మనోనాశనం తర్వాత కూడా కొంతమంది శరీరం వదలరు. వాళ్ళ మనస్సులూ వాళ్ళ దగ్గరే వుంటాయి. ఎందుకంటే అటువంటివారి శరీరం, మనస్సు, సంస్కారాలు అన్నీ భగవన్మయమే కాబట్టి. అటువంటివారే సద్గురువులు. **మనోనాశ్‌తో జ్ఞానం వస్తుంది. జ్ఞానం అంటే అహంబ్రహ్మాస్మి స్థితి.** భగవంతుడు సర్వజ్ఞుడు. అందువల్ల ఆ అహంబ్రహ్మాస్మి స్థితి తృటిలో తెలుస్తుంది. ఏమని! నీకు – తెలుసుకోవడానికి అప్పుడు – ఇప్పుడు ఏమీ లేదని. అది ఏ పేరుపెట్టి పిలిచినా ఒక్కటే అని. అది అంతంలేని స్థితి.

***

ఖోజాగూడా కొండపై మనోనాశ్ కార్యక్రమాన్ని చేపట్టడానికి కొద్దిరోజుల ముందు మెహెర్‌బాబా ఈ సందేశాన్ని ఇచ్చారు. ఇటీవల యాత్రికులకు అనువుగా తీర్చిదిద్దిన ఖోజాగూడా గుహని త్వరలో ఓమారు సందర్శించే ప్రయత్నం చేయండి!!



# హాఫీజ్

**మెహెర్‌బాబాకు అత్యంత ప్రియమైన సూఫీ కవి**

**- వి.ఆర్.కె. శాస్త్రి**

**'నీకు ప్రియతముడు కావాలంటే, మిగిలినవన్నీ మరచిపోయి ప్రియతముడినే నిరంతరం జ్ఞాపకముంచుకో!! ప్రియతముడికి భౌతికంగా దగ్గరగా వుండనక్కరలేదు. నిరంతరం ప్రేమతో జ్ఞాపకముంచుకుంటే చాలు!!**

మెహెర్‌బాబా ఉదహరించిన అనేక హాఫీజ్ కవితలలో ఇది ఒకటి.

**'అదృష్టవంతుడగు బానిసవలె గురువు చెప్పిన ప్రతి ఆజ్ఞ పాలించు'**

మెహెర్‌బాబా శరీరం చాలించే ముందు వినిపించమన్న హాఫీజ్ మూడు సూక్తులలో ఇది ఒకటి. **హాఫీజ్ అసలు పేరు షంషుద్దీన్ మహమ్మద్.**

హాఫీజ్ బాబాకు చాలా ఇష్టమైన కవి. ప్రేమ, విధేయత, సర్వార్పణ ఈ మూడింటికి బాబా అధిక ప్రాధాన్యతనిచ్చారు.

హాఫీజ్ ఈ మూడు విషయాల గురించి తన కవితల ద్వారా ఎంతో బాగా చెప్పాడు. ఇంకా చెప్పాలంటే హాఫీజ్ తన మొత్తం కవితలలో చెప్పింది ఈ మూడింటి గురించే. అందుకేనేమో బాబాకు హాఫీజ్ అంటే అంత ఇష్టం. బాబా సమయం చిక్కినప్పుడల్లా హాఫీజ్ కవితల్ని ఉదహరించి, వివరణ కూడా ఇస్తుండేవారు.

**"సగటు పాఠకుడికి హాఫీజ్ మాటలు నత్తల వంటివి అయినప్పటికీ, అతడి మాటలు దివ్యసాగరములోని ముత్యముల వంటివి"** అని బాబా వ్యాఖ్యానించారు. హాఫీజ్ ద్విపదకు బాబా వివరణ ఇచ్చి, ప్రతి నత్తలోని ముత్యమును వెలికితీశారు.

హాఫీజ్ గురించి బాబా ఇలా చెప్పారు:

"హాఫీజ్‌తో సమానంగా కవిత్వం చెప్పగల వారెవరు లేరు.

అతడొక సద్గురువు. అతడొక పేద కుటుంబంలో పుట్టాడు. అతడు లావుగ, అందవికారంగా వుండేవాడు. అతడి తండ్రి ఒక బొగ్గుల వ్యాపారి. హాఫీజ్ కూడా బొగ్గుల వ్యాపారం చేసేవాడు. బొగ్గు నుసిలాగా చాలా నల్లగా వుండేవాడు. కావున అతడు చూడడానికి ఎలా ఉండేవాడో ఊహించవచ్చును.

అతడి బాల్యము నుండి సద్గురువుల కథలు వినుటకు ఇష్టపడేవాడు.

అతడికి ఖురాన్ మొత్తం కంఠతవచ్చును. అందువల్లనే అతడికి **హాఫీజ్** అను బిరుదు ఇవ్వబడింది. హాఫీజ్ ఇరవై ఒక్క సంవత్సరాల వయస్సులో వుండగా, ఒక పెద్ద భవంతి ప్రక్క నుండి వెళుతూ, అతడు ఆ భవంతిపైన చాలా అందమైన ఒక అమ్మాయిని చూశాడు. అలా చూసి చూడగానే ఆమె యెడల ప్రేమ కలిగి, ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ అమ్మాయి ఆ వీధిలో వెళ్తున్న ఈ అందవికారి హాఫీజ్‌ను గమనించనే లేదు. ఏ దారి తోచని హాఫీజ్ నలభై రోజుల **దీక్ష (చిల్ల నాషిని)** ద్వారా ఆమెను పొందాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో అతడు సఫలీకృతుడవగ, నలభయ్యవ రోజున **దేవదూత గాబ్రియల్** ప్రత్యక్షమై నీవు కోరుకున్నదేదైనా అడగమన్నాడు. గాబ్రియల్ సౌందర్యం కలిగించిన అత్యాశ్చర్యములో మునిగిపోయిన హాఫీజ్, ఆ అమ్మాయి అందాన్ని మరచిపోయాడు. గాబ్రియల్ ఇంత అందముగా వుంటే, భగవంతుడు ఇంకెంత సౌందర్యవంతుడో అని హాఫీజ్ అనుకున్నాడు. అందువలన అతడు వెంటనే, **'నాకు భగవంతుడుకావాలి'** అని జవాబిచ్చాడు. గాబ్రియల్ హాఫీజ్‌ని సద్గురువు అత్తర్ దగ్గరకు పంపించాడు. హాఫీజ్ నలభై సంవత్సరాలపాటు అత్తర్‌ను సేవించాడు. అతడు అత్తర్ పాదాల చెంత తన తల బద్దలుకొట్టుకున్నాడు అని చెప్తాడు. కాని గురువు అప్పటికి కూడా హాఫీజ్ యెడల ఏవిధంగాను దయ చూపలేదు. నలభైయేళ్ళ నరకం తరువాత ఒక రోజున అత్తర్ అకస్మాత్తుగా, భగవదనుభవమును హాఫీజ్‌కి కలుగచేశాడు. ఆ దివ్యానుభవము కలిగిన తరువాత హాఫీజ్ కవితలు చెప్పడం ప్రారంభించాడు. (హాఫీజ్ తన కవిత్వాన్ని రాసేవాడు కాదు. కేవలం కవితలు చెప్పేవాడు. ఆతని శిష్యుడు హాఫీజు చెప్పే పదాలను వ్రాసి భద్రపరిచాడు" అని మెహెర్‌బాబా 1920 దశకంలో ఒకసారి చెప్పారు).

**ఆతని గురించి బాబా ఇంకా ఇలా చెప్పి ముగించారు:**

శక్తులకు యేమి ప్రాధాన్యత లేదు. హాఫీజ్ అంటాడు, 'సద్గురువు పాదాల దగ్గర తన జీవితాన్ని వుంచలేని వ్యక్తి భగవంతుడిని తెలుసుకోలేడన్నాడు. భగవదైక్యం పొందడం చాలా కష్టం. ఒక గురువు యొక్క కృప దానిని చాలా సులభతరం చేస్తుంది. కాని గురువు యొక్క కృప పొందడం, స్వయంకృషితో భగవదైక్యం పొందడం ఎంత కష్టమో అంతే కష్టం. సద్గురువు పాదాల చెంత బానిసగా మారాలి. సద్గురు పాదాల వద్ద జీవితాన్ని అర్పణచేయగానే ఎంతోకాలంగా వున్న అశాంతి, దు:ఖం నుండి స్వేచ్ఛ లభిస్తుంది. దీని అర్థం నీ తల నరుక్కుని గురువు పాదాల వద్ద పెట్టమని కాదు. దీని అర్థం పరిపూర్ణ విధేయత. సద్గురువు యెడల మనసా, వాచా, కర్మణా యదార్థమైన సంపూర్ణ విధే.0యత కలిగి వుండాలి". "గత రెండు వేల సంవత్సరాలలోన హాఫీజ్ వంటి కవి లేడు. ఉర్దూ, పర్షియా కవులందరు అతడి రచనల నుండి స్ఫూర్తిని పొందారని సాక్షాత్తు అవతారుడి ప్రశంసలందుకున్నాడు సద్గురువు హాఫీజ్.

# మెహెరాబాద్ సహవాస్, నవంబరు 1955

## ధారావాహిక సీరియల్, 2014 మార్చి సంచిక నుండి....



1955 నవంబరులో గుజరాతీ, హిందీ, తెలుగు, మరాఠీ ప్రాంతాలవారికి ఒక్కొక్కరికి ఐదు రోజుల చొప్పున మెహెరాబాద్‌లో ప్రత్యేక సహవాస్ కార్యక్రమం మెహెర్‌బాబా నిర్వహించారు. రానూ పోనూ ప్రయాణ దినాలుతో కలుపుకుంటే, ఇది ఒక్కొక్క ప్రాంతం వారికి వారం రోజుల సహవాస్. ప్రతి గ్రూపువారితో బాబా ఖచ్చితంగా ఐదు రోజులు పాటు గడిపారు. వారితో ఎన్నో విషయాలు ముచ్చటించారు. ఆనాడు సహవాసీలతో బాబా ముచ్చటించని అంశం లేదంటే పాఠకులకు ఆశ్చర్యం కల్గుతుంది. ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను సోదాహరణంగా మెహెర్‌బాబా చర్చించారు. ఆనాటి బాబా ప్రేమికులకు అందివచ్చిన సువర్ణావకాశం.

ఈ సహవాస్ గురించి మెహెర్‌బాబా ప్రస్తావిస్తూ, ఈ సవావాస్ ఆనాడు హాజరయిన వారి కోసమే కాదు, భవిష్యత్తులో తనను ప్రేమించేవారందరి కోసం ఏర్పాటు చేసానని అవతారుడు ప్రకటించాడు.

ఆ మాటలు ఇంగ్లీషులో వున్న లార్డ్ మెహెర్‌లో, వాల్యూం 6లో సుమారు 120 పేజీలలో వున్నాయి. ఆ సహవాస్‌లోని బాబావారి మాటలు మనకు నిత్యస్మరణీయం. నిత్య ఆధ్యాత్మిక ఆరాధనా విషయాలు ఎన్నింటినో బాబా ముచ్చటించారు.

ఈ అంశాలన్నింటినీ 2014 మార్చి సంచిక నుండీ **'మెహెరాబాద్ సహవాస్'** శీర్షికతో ధారావాహిక సీరియల్‌గా తేట తెలుగు అనువాదంలో బాబా ప్రేమికులకు అందజేయాలనే ప్రయత్నానికి శ్రీకారం చుట్టాం. గత 20 నెలలుగా ఈ ధారావాహిక సీరియల్ కొనసాగుతోంది. ముందుగా ప్రారంభమైన గుజరాతీయులతో సహవాస్, అనంతరం, తెలుగు వారితో, ప్రస్తుతం హిందీ ప్రాంతీయులతో మెహెరాబాద్‌లో మెహెర్‌బాబా నిర్వహించిన సహవాస్ విశేషాలు తెలియజేస్తున్నాం. ఆణిముత్యాలతో సమానమైన మౌనావతారుని మాటలు బద్రంగా చదవుకోవాల్సిన అవసరం వుంది. మనస్సులో పదిలంగా బధ్రపరుచుకోవల్సిన ఆవశ్యకత వుంది. మీ స్పందన తెలియజేయండి. ఇకపై ప్రక్క పేజీలలో గల **హిందీ సహవాస్** విషయాలు చదవండి!!

# హిందీ సహవాస్

**(గత సంచిక తరువాయి...సహవాసీలతో మెహెర్‌బాబా ఇలా చెబుతున్నారు)**

గత సహవాస్‌లలో మాదిరిగానే తనపై ఆధారపడిన మండలి సభ్యులు,
వారి కుటుంబ సభ్యుల గురించి బాబా వివరించారు.
ఈ విషయంలో మీకు భారం కాకపోతే, మీకు చేతనైన ఆర్థిక సహకారం
అందించమన్నారు. ఒక్క రూపాయి అయినా ఫరవాలేదన్నారు.
ఇందుకోసం ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి విరాళాల సేకరణ చేయొద్దన్నారు.
మీకు వీలైనంతమేర సహాయం అందించమన్నారు.
స్తోమత వుంటేనే ప్రయత్నించమన్నారు. తద్వారా తన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో
పాల్గొన్నవారౌతారని బాబా అన్నారు. ఒకవేళ మీరున్న పరిస్థితుల్లో ఎలాంటి సహాయం
అందించలేకపోతే నిరుత్సాహపడొద్దనీ అన్నారు. నేను చెప్పిన దానికి భిన్నంగా ప్రతి
వారి నుండి విరాళాల సేకరణ మాత్రం వద్దని బాబా తిరిగి గట్టిగా చెప్పారు.
నాకు డబ్బుతో పనేమీ లేదు. డబ్బు ఉన్నా, లేకున్నా నాకు పెద్ద తేడా వుండదన్నారు.
ప్రస్తుతాంశంలో ఐదుగురు సద్గురువులు – వారి అలవాట్లు గురించి బాబా చెప్పారు.
ఆ రోజుల్లో మెహెరాబాద్‌లో పేదవారికి ధాన్యం ఉచితంగా ఇచ్చేవారు.
ఇందుకు సంబంధించిన స్టోర్ రూంకి మండలి సభ్యుడు గుస్తాద్‌జీ ఇన్‌చార్జిగా వున్నాడు.
ఆరంగాంతోపాటు ఆ చుట్టుప్రక్కల వున్న గ్రామాలలోని పేదలు చాలామంది
ఈ ధాన్యాన్ని ఉచితంగా తీసుకునేవారు. ఇదిలావుంటే ఒకరోజున జరిగిన సంఘటనను
బాబా నవ్వుతూ ఇలా చెప్పారు. అహ్మద్‌నగర్ నుండి ఒక పేదవాడు, వృద్ధుడు తరచు
బాబా దర్శనార్థం వస్తుండేవాడు. ఒకరోజున తనదో చిన్న కోర్కె వుందన్నాడు.
అదేదో చెప్పమన్నారు బాబా. నా సర్వస్వం నీ పాదాల చెంత వుంచాలన్నది తన కోర్కె
అన్నాడా వృద్ధుడు. ఓ! అలాగా!! ఆశ్చర్యంగా వుంది నాకు. నీలాంటి వాడు ఒక్కడు
కూడా నాకింత వరకు తటస్థపడలేదన్నారు. నాకు భార్య, ఏడుగురు పిల్లలని
జవాబిచ్చాడు. నాకు ఏమి అంకితమివ్వదల్చావు? నీ దగ్గర డబ్బేమైనా వుందా?
అన్నారు. నా దగ్గర డబ్బేమీ లేదు. నా సంసారం మొత్తం నీకు అంకితమివ్వాలని
వుంది బాబా అన్నాడు. మమ్ముల్ని జాగ్రత్తగా చూసుకోమని అన్నాడు.
ఆ జవాబు విని, నాకు నవ్వు ఆగలేదు. నాకు అంకితమిచ్చేవారు –
ఈ మాదిరిగా కూడా వుంటారా? అని అప్పటి దాకా నాకర్థంకాలేదు.
ఇదొక క్రొత్త రకం అంకితమన్నమాట అని బాబా నవ్వుతూ

ఆనాడు జరిగిన సంగతి చెప్పారు.
బాబా తాను చేసిన వాగ్దానాల గురించి సూచనప్రాయంగా ప్రస్తావిస్తూ
అనాదిగా, యుగయుగాలుగా నేను ఎన్నో వాగ్దానాలు చేశాను. వాటిని భగ్నం కూడా చేశాను. నిజానికి నేనిచ్చిన మాటను నేనెన్నడూ నెరవేర్చకుండా ఉండలేదన్నారు.
బాబా నవ్వుతూ! చూడండి! న్యూ ఢిల్లీ నుంచి వచ్చిన నా ఈ ప్రేమికుడు కెయిన్, నా చెవిలో – ఇక చాలు బాబా – మెహెరాజాద్‌కు సాయంత్రం ఐదుకల్లా వెళ్దాం అని చెబుతున్నాడు. ఈ మాటలు విని అందరూ ఘొల్లున నవ్వారు.
ఆ తర్వాత 10 నిముషాలు విశ్రాంతి తీసుకుని తిరిగి హాల్లోకి రమ్మన్నమని అన్నారు.
తిరిగి వచ్చాక కొద్దిసేపు భజన గీతాలు ఆలాపించారు.
అనంతరం బాబా తన ప్రసంగం కొనసాగిస్తూ, రేపు మీతో ఐదు నిముషాలపాటు **'ప్రేమ కానుక'** గురించి మాట్లాడతాను. నేను చెబుతున్న 'ప్రేమ' గురించి – మీలో ఎవరికి ఏ మేరకు అర్థమయ్యిందో పరీక్షపెడతాను.
ఈ ప్రేమ కానుక అందుకొనడానికి మీలో అర్హులు ఎవరో కూడా చూస్తానన్నారు.
మీ అవసాన దశలో – మీ చివరి క్షణాల్లో – మీరు తుదిశ్వాస వదిలే సమయంలో నా నామం తలుచుకునే ప్రయత్నం చేయండి. మీరు తప్పక నాలో వచ్చి చేరతారని బాబా హామీ ఇచ్చారు. ఆ మాటలు వింటూనే,
సహవాస్‌లలో వున్న **గయా ప్రసాద్ ఖరే** బాబాతో ఇలా అన్నాడు.
బాబా ఆఖరి క్షణాల్లో తలుచుకోమంటున్నావ్ !!
మేం ఆఖరి క్షణాల్లో నిన్ను తల్చుకునే స్థితిలో వుంటామో? లేదో?
అనారోగ్యంతో, అపస్మారక స్థితిలో వుంటేనో? అని తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు.
ఆరోగ్యంగా, చైతన్యంతో వుంటే నీ నామం తల్చుకోగల్గుతాం బాబా అన్నాడు.
తుది క్షణాల్లో నా నామం గుర్తుండాలంటే నేటి నుండీ మీకు అది ఒక అలవాటు అల కావాలి. **నా నామం నిరంతరం స్మరిస్తుంటానన్నారు బాబా ??**
మీరు కూడా నిరంతరం, అనుక్షణం నా నామస్మరణ చేయడం అలవరచుకోండి.
లేనిపక్షంలో ఆఖరి క్షణాల్లో జ్ఞప్తించుకోవడానికి ప్రయత్నించండి.
మీ గతజన్మ బంధనాల నుండి విముక్తి పొందటానికి ఇదొక్కటే సరైన, సులువైన సుగమమైన మార్గం అన్నారు.
హమీర్‌పూర్ నుండి వచ్చిన విష్ణుకి అంతక్రితం జన్మలో ఎంతమంది పిల్లలో చెప్పగలడా? అన్నారు. గతంలో మీరెన్ని సార్లు పుట్టారు. ఎన్నిసార్లు మరణించారు.
ఆయా జన్మల్లో మీ భార్యా పిల్లల సంఖ్య ఎంత వుండింది. ఇవన్నీ మీరు మరచిపోయారు. మీరు మరచిపోయినా, ఆయా జన్మలలోని సంస్కార బంధనాలు మిమ్ముల్ని నేటికీ అంటిపెట్టుకునే వున్నాయి. అలాగే, ఈ జన్మలో మీ సంసార

బంధనాలతో, తిరిగి మరికొన్ని క్రొత్తగా సంస్కారాలు మీరు ప్రోదిచేసుకుంటున్నారు. సంస్కార బంధనాల సంకెళ్ళు నా నామస్మరణ నిరంతరం చేయడం ద్వారా పటాపంచలవుతాయి. మీ గత జన్మల నుండి ప్రోగు చేసుకుంటూ వస్తున్న సంస్కారాలు క్రమేణా తగ్గుతాయి. కనుమరుగవుతాయి. ఈ జనన-మరణాలు కేవలం ఒట్టి మాటలు!! ఇదొక నడుస్తున్న సినిమాలాంటిది. ఈ సినిమా మన కళ్ళెదుట నడుస్తున్నంతసేపూ, మీరు చూస్తున్నంత వరకూ, మీరు చూసేదంతా నిజమని భ్రమిస్తారు. అది కాస్తా ఆగిపోగానే, దాన్ని కాస్తా మీరు మరచిపోతారు. పుట్టుక - చావు, తల్లి - తండ్రి, భార్య, పిల్లల - ఇవేవీ నిజం కాదు. సత్యం కాదు.

మీ సంస్కార బంధనాల వల్ల - మీకు ఇవేవీ తెలియక, మీరు చూసేదంతా నిజమని భావిస్తున్నారు. ఈ సంకట స్థితి నుండి బయటపడటానికి

నా నామస్మరణ ఒక్కటే చక్కటి తరుణోపాయం అని గ్రహించండి!!

నా ఈ భౌతిక దేహం వదిలేసిన అరవై సంవత్సరాల తర్వాత

ఈ ప్రపంచంలో ఎంతమంది నా నామస్మరణతో గడుపుతారో చూడండి.

ఆనాడు వేలాది మంది తమ సర్వస్వాన్ని త్యజించడానికి సిద్ధమౌతారు.

ఐతే! చూశారూ!! - మీరెంత అదృష్టవంతులో. నేను మీ మధ్య వున్నాను.

నా నామం నిరంతరం స్మరించమని - మీతో నేను నేరుగా చెబుతుంటే -

నా ఎదుట ఎంతో సన్నిహితంగా ఉండి - ఆలకించగల అదృష్టం మీకు లభించింది.

మీరెంత అదృష్టవంతులో మీకిప్పుడు తెలియదు. అరవై సంవత్సరాల తర్వాత ఇలా చెప్పగల్గేవారు వారికి ఎవరు లభిస్తారు?

**పాల గిన్నెను స్టౌ మీద పెడితే కొంత సేపటికి పాలు కాగి,**

**అలాగే వదిలేస్తే పొంగిపొర్లుతాయి కదా అన్నారు !!**

ఆ మాటే చెబుతూ - మీకు నాపై ప్రేమ కాగి పొంగి పొర్లినప్పుడు,

ఆ ప్రేమను మీలో నిక్షిప్తం చేసుకోండి. పాలు పొంగినట్లు నా ఎడల గల ప్రేమను బహిరంగ పరచవద్దు. ప్రేమ గురించి మాటల్లో వర్ణించలేం!!

ప్రేమను అనుభవించి తీరాలి. ప్రేమను రహస్యంగా, బధ్రంగా, పదిలపరచుకోవాలన్నారు.

మరో అంశం గురించి ప్రస్తావిస్తూ ఆంధ్రా బాబా ప్రేమికుల నడుమ తలెత్తిన వివాదాలను సర్ది, వారందరిని తానెలా ఒకతాటిపై తీసుకొచ్చారో వివరించారు.

ఆ తర్వాత కొద్దిసేపు భజన గీతాలాపన జరిగింది.

ఆ సమయంలో మెహెరుడి దివ్య కాంతి పుంజం ప్రతి ఒక్క సహవాసీ హృదయాలను తాకినట్లైంది. సహవాసీల కళ్ళు నీళ్ళతో చెమ్మగిల్లాయి.

బాబా ప్రేమను వారు ఆస్వాదించారు.

శ్రీమతి సత్యవతి

ఆ సమయంలో సహవాసీలందరూ ప్రేమ మహా సముద్రంలో ఓలలాడుతున్నట్లుంది!
బాబా సహవాస్ హాలు వదలి నేరుగా వెళ్ళి కారులో కూర్చోకుండా,
కొద్ది దూరం నడిచి వెళ్ళి, ఓ చెట్టు నీడన కూర్చున్నారు.
బాబా తన చేతి వేళ్ళను గాలిలో వేగంగా కదిలిస్తున్నారు.
కొద్ది క్షణాల తర్వాత బాబా వెళ్ళి కార్లో కూర్చున్నారు.
మెహెరాజాద్‌కు బయల్దేరి వెళ్ళారు. సహవాసీలందరూ కారు వెళ్తున్నంత సేపూ బాబాకేసి కడదాకా చూస్తూ నిల్చున్నారు. ఆ మర్నాడు నవంబరు 21. ఉదయం 7.30 కల్లా బాబా మెహెరాబాద్‌కు వచ్చారు. సహవాసీలలో ఒకరైన నిరంజన్‌షా ఆరోగ్యం బాగా లేదు. ఆయన విశ్రాంతి తీసుకుంటున్నాడు. బాబా నేరుగా నిరంజన్ షా గదికి వెళ్ళి, ఆయన్ని పరామర్శించి - మండలివారిని పలకరించారు.
ఆ తర్వాత 8.20 నిముషాలకు సమావేశ హాలుకు వచ్చారు.
నిన్నటి రోజున నిద్రపట్టక ఇబ్బంది పడిన వాళ్ళని లేచి నిల్చోమన్నారు.
హమీర్‌పూర్ నుంచి వచ్చిన శ్రీపతి సహాయ్ లేచి నిల్చున్నాడు.
ఏమయింది? నీ కెందుకు నిద్రపట్టలేదని? ప్రశ్నించారు.
ఏమీ లేదు బాబా - నిన్నటి రోజున భోజనంలో పరిమితిని మించి తినేశాను.
దాంతో రాత్రి కొంత ఇబ్బందిపడ్డానన్నాడు.
ఆయన ప్రక్కనే కూర్చున్న పుకార్ కేసి చూస్తూ - బాబా నవ్వుతూ -
నీ నీడ ఏమైనా శ్రీపతి పైన పడిందా? అని అందర్నీ నవ్వించారు.
హమీర్‌పూర్ నుంచి వచ్చిన మరో ప్రేమికుడు **మాత్ర దత్త శాస్త్రి.**
ఈయనకి కూడా నిన్నటి రోజున నిద్ర సరిగ్గా పట్టలేదు.
కృష్ణ భగవానుడే ఈ అవతారంకాలంలో మెహెర్‌బాబాగా అవతరించాడని సంస్కృత శ్లోకాలలో పఠిస్తూ, బాబా నా తప్పులను మన్నించు. నన్ను క్షమించు బాబా అని ప్రాధేయపడ్డాడు. ఆయనికి బాబా గాఢ ఆలింగన భాగ్యం ఇచ్చి, ఓదార్చారు.
బాబా అలా ఆయన్ని తన దగ్గరగా తీసుకున్నప్పుడు - మాత్ర దత్త శాస్త్రి తనలో తాను ఎంతగానో బాధపడుతున్నాడు. ఏదో తెలియక చేసిన పాపం అంటూ తనలోతానుగా మథనపడుతున్నాడు. రాత్రంతా ఆ బాధతో ఆయనికి నిద్ర పట్టలేదని, ఆయన ప్రక్కనే కూర్చున్న ప్రేమికుడు బాబాతో చెప్పాడు. భయపడొద్దు. దేనికీ భయం వద్దు అని మాత్రా శాస్త్రికి అభయమిచ్చారు బాబా. నీ మనస్సులోని మాట నాకు చెప్పకపోయినా, నాకు తెలియనిది ఏముంటుంది? నేను అవతారుడను. నాకు అంతా తెలుసు.
నీవు ఏ తప్పులు చేసినా నేను క్షమిస్తున్నాను. మంచీ - చెడు, తప్పు - ఒప్పు అనే బేధం లేదు. మీ సంస్కారాల ప్రభావంతో అలాంటి బేధభావాలను మీరు చూస్తారు గానీ, వాస్తవానికి మంచీ - చెడు అనే బేధమే లేదు. మీరు చూస్తున్నదంతా పెద్ద

సున్నా. అంతా మాయ ప్రభావం! అని బాబా అన్నారు. నేను నిరంజన్ సింగ్‌ని క్షమించి వదిలేశానంటే? అర్థం ఏమిటి? అని ప్రశ్నించారు.
నేను అతని సంస్కారాల బంధనాల నుండి తప్పించానని అర్థం చేసుకోవాలి.
ఈ మాయామయ ప్రపంచంలో సంస్కారాల బంధనం నుండి క్షమించానని అర్థం చేసుకోవాలి. అలా చేయడం నాకు ఏమంత కష్టం కాదు సుమీ!!
పెద్ద గడ్డి వాముని, పూర్తిగా తగుల బెట్టి భస్మం చేయడానికి చిన్న అగ్గిపుల్ల సరిపోతుంది!
అగ్గిపుల్ల క్షణకాలంలో ఎంత పెద్ద గడ్డి వామునైనా తగలబెడుతుంది.
గడ్డివాముని – మానవ సంస్కారాల వలయంతో పోల్చితే,
ఆ సంస్కారాలను కన్నుమూసి తెరిచే లోపల నేను తొలగించివేయగలను.
కాబట్టి మాత్రా శాస్త్రి గారూ ... భయపడొద్దు!!
నీలో కల్గిన ఆలోచనల గురించి మరింతగా ఆలోచించ వద్దు.
నేను నిన్ను క్షమించాను. నా నామం నిరంతరం స్మరించు.
నా నామస్మరణ జపిస్తుండగా, నీలో ఎలాంటి ఆలోచనలు వచ్చినా చింతించొద్దు.
ఆ ఆలోచనలను వాటి మానాన వాటిని రానీయండి.
నా నామం స్మరించడం ఆప వద్దు.
ఈ విషయాన్నే నా మండలివారికి రెండుసార్లు గతంలో చెప్పాను.
తిరిగి ఈరోజు మీ కోసం మరలా చెబుతాను.
ఈ సందర్భంలో అది ఓ చక్కని ఉదాహరణ కూడా అంటూ బాబా ఇలా చెప్పారు.
దోమలు మిమ్మల్ని కుడితే మీకు మలేరియా జ్వరం వచ్చే అవకాశం వుంది.
అందుకోసం మీరేం చేస్తారు. మీ మంచం చుట్టూ దోమ తెర కట్టుకుంటారు.
దోమతెరను చూసి దోమలు దూరంగా పారిపోవు.
దోమ తెర బయటనే రణగొణ ధ్వని చేస్తూ, అవకాశం చిక్కితే మీ శరీరాన్ని తాకాలని దోమలు విశ్వ ప్రయత్నం చేస్తాయి. కానీ, మీ చుట్టూతా వున్న దోమతెర దోమల్ని మీ దరికి రాకుండా కాపాడుతుంది. అనేక దోమల నడుమ మీరున్నా, ఒక్క దోమ కూడా మీ శరీరాన్ని తాకలేదు.
అలాగే, మీ మనస్సులోకి ఎన్ని ఆలోచనలు, ఎలాంటి ఆలోచనలు వచ్చినా – నా నామం జపించడం మరవకండి. నా నామం జపిస్తుంటే దోమ తెరలాగా, మీ మనస్సులో వచ్చే అసంఖ్యాక ఆలోచనలు (దోమలు) ఏమీ చేయలేవు.
నా నామం జపిస్తుండగా మీ మనస్సులో కలిగే ఆలోచనల గురించి ఏమాత్రం చింతవద్దు.
శ్రీ శాస్త్రి అసలు విషయానికి వస్తే,
ఆయన బాబా సమక్షంలో బాబా ఎదుట కూర్చున్నా ........
మెహెర్‌బాబా భగవంతుడేనా? ఆయన్ని నమ్మొచ్చా?

అవతారుడు అంటున్నాడు, దొంగ బాబా కాదు కదా?
అనే ఆలోచనల దొంతరలు ఆయన మనస్సును పీడించాయి.
ఈ అసలు విషయాన్ని దాచిపెట్టి – నన్ను క్షమించు బాబా అంటూ ప్రాధేయపడ్డాడు.
పాపం! అవతార్ మెహెర్‌బాబా సమక్షంలో వుండి కూడా ఆయన దేవుడేనా?
అనే సందేహం రావడంతో సహజంగానే బాధపడ్డాడు.
ఐతే, అవతారుడికి తెలియనదేముంటుంది!
శాస్త్రి గారిని మరింత ఇరుకున పెట్టకుండా, ఎలాంటి తప్పు చేశావని సంజాయిషీ వివరణలు అడగకుండా ......అతని మనస్సును ఎరిగిన బాబా నేరుగా క్షమించానని భరోసా ఇచ్చారు. దాంతో శ్రీ శాస్త్రికి బాబా ఎడల నమ్మకం మరింత ధృడపడింది. ఆ తర్వాత బాబా కొన్ని క్షణాలు నవ్వుతూ కూర్చున్నారు. ఆ తర్వాత బాబా తన ప్రసంగం కొనసాగిస్తూ ఇలా అన్నారు.

## ప్రేమ కానుక

ఇప్పుడు మీకు ఓ ఐదు నిముషాలపాటు నేను ఇవ్వదల్చుకున్న ప్రేమ కానుక గురించి చెప్తానన్నారు. ఈరోజు ఉదయం 2 గంటల ప్రాంతంలో నాకీ విషయం గుర్తుకొచ్చింది. నేను చెబుతున్న మాటలు పూర్తి కాకుండా, మేం అన్నింటికీ సిద్ధమని నాకు హామీ ఇవ్వదు. మీ ఆత్మ పరిశీలన చేసుకుని మీరు నిజంగా అందుకు సిద్ధంగా వున్నారా? లేదా? తెలుసుకుని జవాబు ఇవ్వండి. నిజాయితీగా మీరు చేయవల్సివస్తే, నేను చెప్పేదేమీ కష్టం కాదు కూడా! ఐతే అహంభావంతో చేస్తానని ముందుకు రావద్దు. ఒకవేళ నేను సూచించే పనిని చేయలేకపోయినట్లయితే, మీరేమీ బాధపడాల్సిన పన్లేదు. నేను చెప్పేది చాలా సుళువైన పనే! అయితే – అది ఎంత సూక్ష్మమో, సుళువైనదో – అదే సమయంలో మరెంతో కష్టమైనది కూడా.
మీరు నేను చెప్పేది పాటించగల్గితే మీకు ఎంతో లాభం కల్గుతుంది.
లేదంటే నేను ఇవ్వదల్చుకున్న ప్రేమ కానుక – నా దగ్గరే వుంటుంది.
సరైన సమయంలో ఆ ప్రేమ కానుకను నేను తప్పక ఇస్తాను.
ఇక నేను చెప్పేది శ్రద్ధగా ఆలకించండి!
వచ్చేనెల ఫ్రిబ్రవరి 15 నుండి ఒక సంవత్సరం పాటు నేను సుదూర యాత్రకు వెళ్తున్నాను. కాబట్టి ఫిబ్రవరి 15 నుండి ప్రతిరోజూ ఒక ఏడాది కాలం **మొదటి రోజున 14సార్లు, ఆ మర్నాడు 28 సార్లు నా నామం జపించాల్సి వుంటుంది.** ఇందుకు భిన్నంగా ఒక్కసారి కూడా ఎక్కువ స్మరించ రాదు.
**ఇదొక కఠిన నియమం.** 14 సార్లు అంటే 14 సార్లు మాత్రమే స్మరించాలి. అలాగే, 28 సార్లు అంటే 28 సార్లు మించి ఒక్కసారి కూడా అదనంగా జపించ రాదు. ఆ తర్వాత ఏమంటే ఇలా 14 లేదా 28 సార్లు నా నామం స్మరించాక,

తిరిగి ఆ రోజు మొత్తంలో (24 గంటల్లో) నా నామస్మరణ చేయరాదు.
దాన్నే నేను **'ప్రేమ కానుక'** అంటున్నాను.
సాధారణంగా రోజు మొత్తంలో మీ దగ్గర బంధువులు స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు **బాబా!! అని** ప్రేమతో ఉచ్ఛరించినా ఫరవాలేదు. కానీ, మీకేమైన జ్వరం, దగ్గు, జలుబు లాంటి రోగాలతో వున్నప్పుడు 'బాబా' అని మాత్రం స్మరించ రాదు.
అలాగే, ఏదైనా ఆకస్మిక ప్రమాదాల సమయంలో, మంచి, లేదా తప్పులు దొర్లినప్పుడు మీకు తెలియ కుండా కూడా 'బాబా' అని మీ నోటి వెంట సంబోధన రారాదు.
ఈ 14 లేదా 28 సార్లు స్మరించే బాబా నామం కూడా ప్రతిరోజు అర్ధరాత్రి ఠంచనుగా 12 గంటలకు చేయాలి. ఒక్క సెకను ముందు కానీ, వెనుకకు కానీ కూడదు.
జాగ్రత్త!! దీన్ని బాగా గుర్తుంచుకోండి!!
ఆ రోజు మొత్తంలో (24 గంటల్లో) అర్ధరాత్రి 12 గంటలకు తప్పించి
**మరెన్నడూ 'బాబా' నామం ఉచ్ఛరించరాదు.**
నన్ను మరింతగా గుర్తుంచుకుంటూ స్మరిస్తూ వుంటే మీకే ప్రమాదం!!
పొరపాటున మిమ్మల్ని ఎవరైనా తాకినా, మరేదైనా కారణంగా, 'బాబా' అని స్మరించడం కూడా నిషిద్ధం!! అదేకనుక జరిగితే నేను ఇచ్చిన నియమాన్ని మీరు ఉల్లంఘించినట్లౌతుంది. మీరు నా పరీక్షలో తప్పినట్లౌతుంది!!
కాబట్టి, మీరు చాలా జాగ్రత్తగా వుండాలి.
నేను చెప్పదల్చుకున్నది స్పష్టంగా **"ఖుల్లా"** చెప్పాను.
దీని అమలు చేయడం ఇక మీ చేతుల్లోనే వుంది.
సహవాసీలలో ఒకరైన **ఆదర్ష్ ఖరే** బాబా ఎదుట లేచి నిలబడి – బాబా –
మా త్రండిని మేం 'బాబా' అనే ప్రేమగా పిలుస్తాం.
మరి ప్రస్తుత విషయంలో ఆయన్ని ఏమని పిలవాలని అడిగాడు.
మీ తండ్రిని 'బాబా' అని పిలుచుకోవచ్చు.
అదే సమయంలో ఆయన్ని 'బాబా' అనిపిలిచేటప్పుడు నా రూపం కానీ,
నా గురించి నీకు జ్ఞప్తికి రాకూడదు.
ఆ సమయంలో 'బాబా' అంటే నీ మనస్సులో కేవలం మీ తండ్రిగారు మాత్రమే అయివుండాలి!! నిరంన్‌షాతో బాబా మాట్లాడుతూ నేను చెప్పిన ఈ 'ప్రేమ కానుక' ఈ ప్రపంచంలో ఎవరైనా ఆచరణలో అమలు చేయగల్గుతారా? అని ప్రశ్నించారు.
తప్పకుండా చేయగల్గుతారు బాబా – ఇది సాధ్యమే!
అసాధ్యం ఏమాత్రం కాదు అని ఆయన జవాబిచ్చాడు.
బాబా నవ్వుతుండగా – సహవాస్‌లలో ఒకరు లేచి నిలబడి –
బాబా ఒకవేళ సరైన టైం చూసుకోవడానికి గడియారం –

వాచ్ లేకపోతేనో అని తన సందేహం వెలిబుచ్చాడు.
అలాగయితే, ఏదైనా అనారోగ్యంతో బాధపడుతుంటేనో లేదా
సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు,
విరోచనాలుతో బాధపడుతూ పాయిఖానాకు వెళ్ళవల్సివస్తేనో అని కూడా
మీలో ఒకరు అడగొచ్చు. ఐతే, ఇది చాలా కష్టం.
మీరు నన్ను నా నామం రోజు మొత్తం 24 గంటల్లో గుర్తుంచుకోరాదంటే కూడా
చాలా కష్టమే మరి!! నన్ను గుర్తుంచుకోకుండా, నన్ను స్మరించకుండా మీరెలా
వుండగలరు?? సహవాసీలలో ఒకరైన శ్రీవాస్తవ మాట్లాడుతూ ఇవన్నీ ఎలాగున్నా -
నీవు మాకు మరికొన్ని కష్టాలు కల్గించకూడదన్నాడు.
నేనెందుకు కష్టాలు కల్గిస్తాను. నే చెప్పేది ఒక్కటే. అర్ధరాత్రి ఠంచనుగా
12 గంటల తర్వాత, తిరిగి 24 గంటల పాటు నా నామం స్మరించరాదు!
నా నామం ఉచ్చరించడం నిషిద్ధం! అంతమాత్రమే నేను కోరుకునేది.
శ్రీవాస్తవ తిరిగి మాట్లాడుతూ - బాబా నీవెలాగైనా ఈ పరీక్షలో మేం నెగ్గరాదని
బావిస్తావు అన్నాడు. నిరంజన్ షా మాట్లాడుతూ -
గతంలో తన స్నేహితుడైన హరిచందర్ సింగ్ నీ దర్శనం కోసం వచ్చినప్పుడు -
అతడ్ని ప్రతిరోజు అర్ధరాత్రి 5 నిముషాలు నీ నామం జపించమని ఆదేశించావ్.
బాబా - రోజంతా నీ నామం స్మరించడం సుళువేమో కానీ,
ఇలా ఫలానా టైంలో అంటే కష్టమే సుమీ అని హరిచందర్ సింగ్ నాతో అన్నాడన్నాడు.
ఏది ఏమైనప్పటికీ ఈ విషయంలో 24 గంటలు అప్రమత్తతతో వుండాలి.
ఎవరైతే ఈ నియమాన్ని తు.చ. తప్పక పాటించ గలరో
వారికి నా ప్రేమ కానుక తప్పక లభిస్తుంది అని బాబా హామీ ఇచ్చారు.
ఈ మాటతో సహవాసీలందరూ ఆశ్చర్యపడ్డారు.
ఆపై బాబా మాట్లాడుతూ, ఆధ్యాత్మిక పథంలో మీరు దేన్ని త్యజించాల్సిన పనిలేదు.
ఈ సమాజంలో వుంటూ బంధు - మిత్రులందరితో కులాసాగా గడుపుతూ
నీ రోజువారీ పనులు చేసుకుంటూ,క్రమేణా బంధనాలు తగ్గించుకుంటూ
భగవన్నామస్మరణ, నా నామం అడపాదడపానైనా స్మరిస్తూ కాలం గడపగల్గాలి.
అదీ కుదరని పక్షంలో రాత్రికి నిద్రపోయే ముందు, అలాగే, తెల్లవారగానే నిద్రలేచే
ముందర - నా నామం స్మరించడం అలవరుచుకోండి!!
ఇదేమిటి? ఇదెలా సాధ్యం? అని బెంబేలు పడొద్దు.
ప్రశాంతంగా ప్రయత్నం ప్రారంభించండి. అన్నీ సానుకూలమవుతాయి.
**సాధనమున పనులు సమకూరు ధరలోన సమకూరు ధరణిలోన కదా!! - కవి వాక్కు**
భార్యా - పిల్లలు, సంసారాన్ని కాదు పరి త్యజించాల్సింది.

నీ మనస్సును పరిత్యజించాలి!!
ఉపవాసాలతో మీ కడుపును మాడ్చ వద్దు.
ఎలాంటి ఆలోచనలు రానీయకుండా మీ మనస్సును
నియంత్రించేందుకు ప్రయత్నించండని బాబా సహవాసీలతో అన్నారు.
ఫిబ్రవరి నుండి ఏడాదిపాటు నేను నిర్వహించే సుదూర యాత్రకు నాతోపాటు కేవలం నల్గురైద్గురు మండలివారిని నాతో తీసుకెళ్తున్నాను. మిగిలిన వారందరూ ఇక్కడే వుంటారు. సహవాసీలలో వున్న దౌలత్ సింగ్‌ని
సిక్కుల పవిత్ర గ్రంధం **గురుగ్రంధ్ సాహెబ్** నుంచి రెండు పద్యాలు గట్టిగా పాడమన్నారు.
దౌలతో సింగ్ **'భగవంతుడు – ఉన్నతుడు. అతను ఉన్నతోన్నతుడని'**
మధురంగా ఆలాపించాడు. ఈ మాటలు బాబాకు ఎంతగానో నచ్చాయి.

# మెహెరాస్తానా 14వ వార్షికోత్సవం

బాబా తన రెండవ ఆంధ్రా పర్యటనలో భాగంగా 26.02.1954 పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, రామచంద్రపురం గ్రామంలో బాలగోపాల సోదరుల ఇంటిని సందర్శించారు. బాబా పాదస్పర్శచేత పునీతమైన ఈ స్థలంలో **"మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రము**ను" భాస్కరరాజు సోదరులు ఏర్పాటు చేశారు. కాగా, మెహెరాస్తానా 14వ వార్షికోత్సవం సందర్భంగా 2015 నవంబరు 15, ఆదివారము ఉదయం 6 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు బాలగోపాల మెహెర్ ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు.
శ్రీ కోడూరి శివరామకృష్ణ తులసీ వరప్రసాద్, శ్రీ బాలగోపాల రామకృష్ణరాజు, శ్రీ పి. మెహెర్‌కాంతి, శ్రీకాకుళం, శ్రీ టి. ప్రసన్న కుమార్, విజయవాడ, శ్రీ యు. బాపిరాజు, ఏలూరు, శ్రీ బాలగోపాల రాఘవ సుందర రాజు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగిస్తారని అన్నారు. శ్రీ కె.వి. రమణ (పండుగ రమణ), హైదరాబాద్ భజన కీర్తనలు ఆలాపిస్తారు. ఆసక్తి గల బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు శ్రీ బాలగోపాల మెహెర్ ప్రభు, గొల్లగూడెం, ఉంగుటూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా – 534 406, ఫోన్.. 80962 69887, 95424 29124, 08818–271773 సంప్రదించగలరు.

# అఘోరపతి వారింట వివాహము

శ్రీ తారక రామం, శ్రీమతి ఉమ గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ మెహెర్ దివ్య వివాహం చి॥ లక్ష్మీ నారాయణమూర్తితో 29.10.2015 రాత్రి గం. 11:12 ని.లకు శ్రీ దేవి దండుమారమ్మ కళ్యాణమండపం, కలెక్టర్ ఆఫీసు దారి, కంటోన్మెంటు, విజయనగరంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# మా హమీర్‌పూర్ యాత్ర

డా. వై. విజయసారథి, అధ్యక్షులు, తాడేపల్లిగూడెం, రామారావుపేట బాబా సెంటర్ ఆధ్వర్యంలో మొత్తం 57 మంది బృందం ఉత్తరప్రదేశ్‌లో వున్న హమీర్‌పూర్ బాబా సెంటర్‌కు ఓ ప్రత్యేక యాత్రగా సెప్టెంబరు 18న బయలుదేరి వెళ్ళామని ఒక లేఖలో తెలిపారు. ఇది మా చిరకాల వాంఛ అన్నారు. హమీర్‌పూర్ సెంటర్ వారు మా బృందానికి అన్ని ఏర్పాట్లు చేసి సహకరించారు. మేళా సమయంలో వెళ్తే అనేకమందితో బాబా పాదస్పర్శతో పునీతమైన ప్రదేశాలను నిశితంగా చూడలేమని ఈ యాత్ర చేపట్టినట్లు శ్రీ విజయసారథి అన్నారు. హమీర్‌పూర్ సెంటర్‌వారి ప్రేమకు మేమందరం ఉక్కిరిబిక్కరయ్యామన్నారు.

# గృహ ప్రవేశం

26.09.2015 శనివారం విజయవాడ ప్రసాదంపాడు నందు శ్రీ కె. రామారావు, శ్రీమతి కె. శకుంతల గార్ల నూతన గృహ ప్రవేశం సందర్భముగా అవతారుని కార్యక్రమాలు సా. 6 నుండి 8 వరకు జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాదు నుండి విచ్చేసిన బాబా ప్రేమికులు శ్రీమతి కృష్ణవేణి, శ్రీ అప్పారావు గార్లు పాల్గొని బాబా పాటలు గానం చేసినారు. శ్రీమతి జి. సుబ్బలక్ష్మి గారు బాబాయందు ప్రేమ విశ్వసనీయత గురించి మరియు బాబా సందేశాలు ప్రసంగించారు.

# సర్వసభ్య సమావేశం

02.10.2015 శుక్రవారం అవతార్ మెహెర్‌బాబా విజయవాడ సెంటర్ యొక్క సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2015-17 సంవత్సరములకుగాను, పూర్వ పాలకవర్గము యధాస్థితిగా కొనసాగించవలెనని బాబా ప్రేమికులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బాబా సెంటరుకు అడ్వజరీ కమిటి సభ్యులుగా శ్రీ సి. హెచ్. హరనాధ్ శ్రీ ఎ. మెహెర్ కుమార్‌ను ఎన్నుకోవటం జరిగింది.

# ఠాకూర్

మెహెర్‌బాబా నవజీవనంలో భాగంగా చరిత్రాత్మక నగరం **"సారనాథ్"లో**వున్న సమయమది. మెహెర్‌బాబా ఆయన స్త్రీ, పురుష మండలి వాందరూ సుమారు 12 రోజులు పాటు సారనాథ్‌లో ఉండేందుకు వీలుగా రెండు పెద్ద బంగళాలను అద్దెకు తీసుకున్నారు. ఈ బంగళాలు చాలా విశాలమైన ప్రాంగణంలో వున్నాయి. చుట్టూతా పండ్ల తోటలున్నాయి. ఈ తోటలకు కాపలాదురులుగా ఓ ముసలి తోటమాలి, ఆతనికి సహాయకుడిగా మరో యువకుడున్నాడు. ఈ తోటమాలీలిద్దరూ వచ్చి బాబాని దర్శించుకున్నారు. స్త్రీ మండలి ఏం చేసిందంటే, గత రోజు రాత్రి మిగిలిన ఆహార పదార్థాలుంటే ప్రేమగా కుర్ర తోటమాలికి యిచ్చారు. అతను ఆనందంగా తీసుకున్నాడు. ఐతే, ఈ వృద్ధుడు మాత్రం తనకేం వద్దని సున్నితంగా తిరస్కరించాడు. బాబా మండలి సభ్యురాలు డా॥ గోహెర్ ఆ ముసలివానితో మాట్లాడింది. ఆతనికి నా అనేవాళ్ళు ఎవరూ లేరని తెలిసింది. భార్య ఎన్నడో చనిపోయింది. అలా ఒంటరిగా, ఓ సన్యాసిలా భగవధ్యానంతో కాలం వెళ్ళదీస్తున్నాడు. అతను చలిలో, ఆరుబయట ఓ పాత కుక్కి మంచంపై పడుకునేవాడు. తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచి రామ నామస్మరణ చేసుకునేవాడు. ఈ నామస్మరణతో ఇంకా కాసేపు పడుకోవాలని వున్నా, స్త్రీ మండలి పెందలాడే లేచేవారు. బాబా కూడా ఆ శ్రీరామ నామజపం ఆలకించండని పెందలకడనే లేపేవారు. అతగాడు పగలంతా కూడా రామనామం జపించేవాడు. బయట చలికి గడ్డకట్టేలా వున్నా, చిన్న గోచీ పాత గుడ్డ నడుముకి కట్టుకుని బావి దగ్గర ఉదయాన్నే చన్నీళ్ళ స్నానం చేసేవాడు. రగ్గులు కప్పుకుంటున్నా చలి భరించలేక చస్తుంటే, ఆ మాలి తీరు ఆశ్చర్యం కల్గించేది. తోటలో పండించిన కూరగాయలు బాబా మండలికి ఇచ్చేవాడతను. బాబాకు అతనంటే ప్రత్యేక అభిమానం కల్గింది. ఓ రోజున బాబా అతనికి ఏం కావాలో కనుక్కోమన్నారు. మండలివారు అలా అడగ్గానే, **ఆతను ఠపీమని, నాకేం కావాలి! ఏమీ అక్కర్లేదన్నాడు. నాక్కావల్సినవన్నీ నా ఠాకూర్ చూసుకుంటాడన్నాడు. ఠాకూర్ అంటే తోట యజమాననుకున్నారందరూ.** ఓ రాజు రాత్రి, మంచి చలిలో పల్చని దుప్పటి కప్పుకుని పడుకున్న మాలీని చూసిన బాబా తిరిగి తన మండలిని అతని దగ్గరకి పంపారు. అతను ఏది కావాలని భావిస్తే దాన్ని తప్పకుండా ఇద్దామన్నారు బాబా. ఎంత అడిగినా నాకేం వద్దు. అంతా ఠాకూరే ఇస్తాడు! నాకేం అవసరాలు లేవన్నాడు. అతి బలవంతం మీద, సరే! ఓ అగ్గిపెట్టె ఇప్పించమన్నాడు తోటమాలి. బాబాకు ఈ విషయం చెప్పారు. బాబా ఆతడిని పిలిపించారు. ఆతను కోరిన అగ్గిపెట్టెను ఇస్తూ, ఈ **'దుప్పటి'** కూడా తీసుకోమన్నారు. ఇది నా ప్రసాదం. స్వీకరించమన్మారు. తోటమాలి మారు మాట్లాడ లేదు. **'నేను ధన్యుడను'.**ఇది భగవంతుడిచ్చిన కానుక అన్నాడు. బాబా మండలితో మాట్లాడుతూ అతనికి ఎలాంటి కోరికలు లేవు. ఆతను ఓ నిజమైన సాధువు. ఆతను కోరుకున్నది ఠాకూర్‌జీని. అందుకే, ఈ రోజున ఆ ఠాకూర్ ఆతని కోసం వెదుక్కుంటూ ఇక్కడకు వచ్చాడని **అన్నారు.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్,
న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

బాబావారు ఇసఫహాన్‌లో వున్న సంగతి ఎలా పొక్కిందో పొక్కింది.
ప్రభు దర్శనం కోసం తపన పెరిగింది.
యుగావతారుడు ఎవరికీ దర్శనం ఇవ్వటం లేదని తెలిసినా,
మాకు దర్శనం ఇప్పించరూ అనే వినతులు రాసాగాయి.
బాబా లాకెట్లు దర్శనమిస్తున్నాయి.
ఎక్కడపడితే అక్కడ కొందరయితే బాబావారి లాకెట్లు
కోటుకు పెట్టుకొని మరీ తిరుగుతున్నారు.
బజారుకెళ్ళిన రావ్‌సాహెబ్‌కి ఇది అంతా నిజమా, కలా అనిపించింది.
బాబావారి చెవిన వేశాడీ సంగతి. ఎవరిచ్చారు ఆ లాకెట్లు అని బాబావారు ప్రశ్నించారు.
అయినా నేనిక్కడున్న వైనం గోప్యంగా వుంచమన్నాను కదా!
ఇదా మీ నిర్వాకం అని మండలిని నిలదీశారు.
మేము ఎప్పుడయినా మీరు వద్దన్న పని చేశామా? అని వాళ్ళు ఎదురు ప్రశ్నించారు.
మరి ఎవరు చేశారు? ఇదొక మీమాంస కాసేపు. కాసేపు అంటే కాసేపు.
ఎందుకంటే, ఈ నిర్వాకం సయ్యద్, హుసేన్‌లది కాదు కదా అన్న అనుమానం వుంది.
ఈ ఇద్దరూ స్థానికులు. మండలివారి పనులు చేసిపెడ్తున్నారు.
ఏరా? మీరా బాబావారి ఉనికిని బయటపెట్టారా అని అడిగారు.
అబ్బే మేము ఎందుకు చెప్తాం అని నసిగారు.
గట్టిగా దబాయించగానే బావురుమన్నారు.
బాబావారిని రోజూ చూస్తున్నాం.
మరి మావాళ్ళకి కూడా బాబావారిని చూస్తే బాగుండును అనిపించింది.
అంతే ఇంకేంచేయలేదు. మావాళ్ళకి తప్ప ఎవరితోనూ చెప్పలేదు అన్నారు.
ఎవరికీ ఈ విషయం చెప్పకురా అని ఓ రహస్యం చెవిన వేస్తే,
గుట్టు రట్టుచేశారట వెనుకటికి ఓ పెద్దమనిషి. ఎవరికీ చెప్పవద్దని చెప్పాను కదా,
మిత్రుడు అని నిలదీస్తే, ఆ పెద్దమనిషి, నెనెవరికీ చెప్పలేదురా.

అడిగినవాళ్ళకీ, అడగనివాళ్ళకీ తప్పు ఎవరితోనూ అనలేదు అన్నాడట.
సయ్యద్, హుసేన్‌లంతే చేశారు.
బాబావారికి కోపం వచ్చిందో, నవ్వు వచ్చిందో తెలియదు కానీ వాళ్ళిదరికీ
ఓ హిత వాక్యం చెప్పారు. అయితే అందరి ముందు కాదు లెండి.
ఆ కుర్రాళ్ళని దగ్గరకి తీసుకొన్నారు. లాలించారు.
భయం పోగొట్టారు. అబద్ధం చెప్పకండి ఎప్పుడూ అన్నారు.
పొరపాటునో, గ్రహపాటునో మృత్యువు ముంచుకొచ్చినా బొంకకండి,
నా దగ్గరవున్నా, ఇంకెక్కడ వున్నా సరే అబద్ధం చెప్పకండి అన్నారు.
వాళ్ళు సరేనన్నారు. బుర్రలూపడం కాదు. మాట నిలబెట్టుకోవాలి అన్నారు.
మీరు చెప్పినట్లే నడుచుకొంటాము బాబా అంటూ ఆ కుర్రాళ్ళు వాగ్దానం చేశారు.
ప్రభువు సంతోషించారు. వాళ్ళని అక్కున చేర్చుకొని ముద్దాడారు.
రోజు రోజుకీ బాబా దర్శనార్థుల సంఖ్య పెరుగుతోంది.
ఇప్పుడు కాదు, తర్వాత చూద్దాం అనడం బాబావారి వంతు అయింది.
మండలివారికి ఏం చేయాలో పాలుపోలేదు.
స్థానికుల అభ్యర్థన బాబావారికి చెప్పడం, బాబావారి నిర్ణయాన్ని స్థానికుల
చెవిని వేయడం, ఇంతే వారు చేయగల పని.
ఆ పని శ్రద్ధగా చేస్తున్నారు. ఇప్పుడు కాదు, తర్వాత చూద్దాం అనడం బాబావారు,
స్థానికుల నిరాశతో వెనుతిరగడం జరుగుతోంది.
అయితే, ఓ రోజున బాబావారికి ఇరానీయులపై జాలి కలిగినట్లుంది.
ఈ వేళ దర్శనమిస్తాను అన్నారు.
ధనికులు, పేదలు, నిరు పేదలు అందరూ వచ్చారు.
ప్రభుని దర్శించారు. కొందరయితే బాబావారి పాద పద్మాలని స్పృశించి,
తాకామని తృప్తి పడ్డారు. బాబావారి లాకెట్లు, ఫోటోలని ఇచ్చారు మండలివారు.
మహా ప్రసాదమని కళ్ళకు అద్దుకొని ఇంటి దారి పట్టారు.
ఇస్లామ్ మతం ప్రకారం, గురువు ఫోటోని లాకెట్లు పెట్టుకోకూడదు.
మరి ఆ సంగతి వారు మరచిపోయారో ఏమో!
బహుశా మెహెరుని దివ్య ప్రేమలో వాళ్ళ చాంధసత్వం కరిగిపోయిందేమో.
ఏమయితేనేం, మెహెరావతారుని ప్రేమ బీజం నాటబడింది ఇసఫహాన్‌లో.
అక్కడి నుంచి యెజ్ద్‌కి అక్టోబరు 22న బయలుదేరారు.
ఆ కొత్త నగరంలో బాబావారి ఏకాంతవాసానికి వీలవుతుందో లేదో తెలీదు.
ఈమాటే బాబావారన్నారు బండి ఎక్కేముందు.
'యెజ్ద్‌లో ఏకాంతవాసం వీలైతే మంచిదే' నన్నారు.

మరి వీలుకాకపోతే! చూద్దాం ఏం జరుగుతుందో అన్నారు.
యెజ్ద్ దరిదాపుల్లోనే జఫ్రాబాద్ అన్న మరో పెద్ద నగరం వుంది.
ఆ ఊర్లోకి వెళ్ళకుండానే యెజ్ద్ చేరుకోవచ్చు.
జఫ్రాబాద్ నివాసి బైదుల్. బహుశా అందుకనే అనుకొంటా, జఫ్రాబాద్ దగ్గరపడుతుంటే, బాబావారు అడిగారు 'ఏం! ఊళ్ళోకి వెళదామా?
ఎకాయెకి యెజ్ద్‌కే పోదామా' అని.
జఫ్రాబాద్ వెళదామని మండలివారు అనడంతో, రావ్‌సాహెబ్‌ని బైదుల్ ఇంటికి పంపారు. తమ రాక గురించి తెలియజేయమన్నారు.
రావ్‌సాహెబ్‌ని చూస్తూనే బైదుల్ ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.
బాబావారిని చూడాలని తహతహలాడుతున్నాడు.
ప్రభుని చూసి చాలారోజులయింది మరి.
ఆరుగురు ప్రేమాశ్రమం పిల్లల్ని వెంటబెట్టుకొని పరిష్యా వచ్చి అయిదు నెలలు అయింది అప్పుడే. అందుకని కబుర్ల పుట్ట రావ్‌సాహెబ్ మాటలు చెవికి ఎక్కలేదు.
ప్రభువు దగ్గరకి పరుగున చేరాడు.
మెహర్బాన్ పూర్, ప్రేమాశ్రమం పిల్లలు వెనకాలే వచ్చారు.
మెహెరావతారునికి సాదరంగా స్వాగతం పలికారు. ప్రభువు ప్రసన్నులయ్యారు.
జఫ్రాబాద్ నుంచి యెజ్ద్‌కి రెండు రోజుల ప్రయాణం.
బాబావారు మండలి ఆ ఊరు చేరేసరికి బాగా చీకటి పడింది.
బస స్థానిక సత్రంలో. అక్కడి ప్రముఖ వ్యాపారవేత్త అర్బాబ్ రుస్తుం ఖుస్రోవ్ ఉదయాన్నే బాబావారిని దర్శించాడు.
'మా ఇంటిని పావనం చేయండి.
మా ఆతిధ్యం స్వీకరించండి ప్రభూ! అని వేడుకొన్నాడు.
ప్రభువు భక్తుడి కోరిక కాదనలేదు. 'నీ ఇంట్లోనే బస చేస్తాలే' అన్నారు.
ఇసఫహాన్ చేరేసరికే ఛాన్జీ, కరీం మంచాన పడ్డ సంగతి పాఠకులకి గుర్తుంది కదా.
జ్వరం తగ్గటం లేదు. అయినా బాబావారి వెంట గతుకుల రోడ్డుపై ప్రయాణం చేస్తున్నారు. ఒళ్ళు హూనం చేసుకొంటున్నారు.
తోటి మండలివారికి వాళ్ళని చూస్తుంటే "అయ్యో! పాపం", అనిపిస్తోంది.
బాబాని మించిన వైద్యుడు ఎవరున్నారు కనుక.
బాబా నామమే వాళ్ళకి గొప్ప టానిక్ అనుకొన్నారు.
యెజ్ద్ వెళ్ళినా వాళ్ళ పరిస్థితి మెరుగుపడలేదు.
ఛాన్జీ, కరీంలను సిద్ధూ కంటకిరెప్పలా చూసుకొంటున్నాడు.
ఇప్పుడు మన దేశంలో మాదిరి అప్పట్లో పరిష్యాలో కూడా పరిశుభ్రత తక్కువ.

ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు కనిపించేది.
మంచినీళ్ళ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండేది.
మురుగు నీరు, మంచినీళ్ళు కలిసిపోయేవి చాలాచోట్ల.
ఈ పరిష్యా యాత్రలో మండలివారు చాలా కష్టపడ్డారు.
ముఖ్యంగా మంచినీళ్ళ విషయంలో.
నీళ్ళు తీసుకొచ్చే బాధ్యత సిద్ధుపైన పడింది.
శుభ్రమైన నీళ్ళు దొరకడం కష్టమన్నారు అందరూ.
చిన్న చిన్న మడుగులు కనిపిస్తాయి.
అక్కడి నీళ్ళు బాగుంటాయి అని సలహా ఇచ్చారు కొందరు.
ఈ మడుగులు ఎవరు త్రవ్వారో తెలీదు. పెద్ద పెద్ద ఇళ్ళ ముందున్నయి మడుగులు.
చాలాచోట్ల అంరదూ అక్కడ నీళ్ళు తెచ్చుకొంటున్నారు.
బిందెల్లో, ప్లాస్టిక్ క్యాన్లలో మనం నీళ్ళు తెచ్చుకొన్నట్లు, అక్కడివాళ్ళు తోలు సంచుల్లో
నీళ్ళు పట్టుకొంటున్నారు. మన మిత్రుడు వెళ్ళాడు, ఓ మడుగు దగ్గరకి.
నీళ్ళ కోసం తాను ఓ తోలు సంచి పట్టుకువెళ్ళాడు.
అక్కడి దృశ్యం చూసి నిర్ఘాంత పోయాడు.
అంతా మురికి మురికిగా వుంది. గట్టుపై ఎక్కడ చూసినా మలం.
భరించలేనంత వాసన. ఓ పెద్ద మనిషి అక్కడే మూత్రవిసర్జన చేస్తున్నాడు.
ముక్కుమూసుకొని సంచి నిండా నీళ్ళు నింపుకొన్నాడు సిద్ధు.
బసకి తిరిగి వచ్చాక, బాబావారికి చెప్పాడు.
ఈ నీళ్ళు త్రాగితే రోగాలు వస్తాయి బాబా అన్నాడు.
'నీళ్ళు బాగా కాచి వడపోసి త్రాగండి' అన్నారు ప్రభువు.
ఎంత సేపు మరిగించమంటారు అని అడిగాడు మన మిత్రుడు.
నీళ్ళు మరిగించు ఓసారి. ఒడగట్టు.
మళ్ళా మరిగించి ఒడగొట్టు.
నీళ్ళు శుభ్రంగా ఉన్నాయనుకునే వరకు ఇలానే చేయమన్నారు బాబా.
మన సిద్ధు చెప్పినట్లే చేశాడు.
అప్పటి నుంచి ఇండియా వాపసు వచ్చేవరకు ఇదే జాగ్రత్త తీసుకొన్నారు.
సరే, బాబావారు వచ్చిన సంగతి తెలిసి చాలామంది ప్రభు దర్శనానికి వచ్చారు.
కొందరు మహ్మదీయులు ఇంకొందరు జొరాష్ట్రియను మతస్థులు.
వీరందరూ బాబావారిని యుగావతారుడిగా అంగీకరించారా? ఇదొక చిక్కు ప్రశ్న.
బాబావారు పుట్టి పెరిగిన నగరంలోనే చాలామందికి
ఆయన ఉనికి తెలియదు ఆ రోజుల్లో.

అయినా మెహెరుడే తమ పరాత్పరుడు అని వచ్చినవారు ఎందరో.
కొందరు దర్శనం చేసుకొని మళ్ళీ రాలేదు.
ఇంకొందరు ఆయన కొంగుపట్టుకొని వదల లేదు.
అటు అహమ్మద్‌నగర్‌లోనూ, బొంబాయిలోను కూడా ఇంతే జరిగింది.
బహుశా అలనాడు యెజ్ద్‌లో కూడా ఇలానే జరిగి వుంటుంది.
పూర్వజన్మ సుకృతం కొద్దీ, భగవదన్వేషణా శక్తి పుట్టి,
ప్రభు దర్శనం చేసి వుండవచ్చు. కొందరు,
ఏ పుట్టలో ఏ పాము వుంటుందో ఎవరికి తెలుసు.
ఓసారి చూసివస్తే పోలేదూ అనిపించి ప్రభువు గడప త్రొక్కివుండవచ్చు.
బహుశా ఇందుకనే, బాబావారు ఏనాడో శెలవిచ్చారు,
తమ దర్శనార్థం వేలాదిమంది రావచ్చు.
వచ్చినా, తమ గురించి తపిస్తూ వచ్చేది ఒకరు ఇద్దరేనని బాబావారు అన్నారొకసారి.
ఈ సంగతే యెజ్ద్‌కి వర్తిస్తుంది.
చాలామంది ప్రభువుని తమ ఇంటికి రమ్మని పిలిచారు.
వాళ్ళ కోరికని మన్నించారు మెహెరుడు.
యెజ్ద్ ప్రత్యేకత తెలుసా పాఠకమహాశయా!
అలోబాగా చిరపరిచితుడైన ఆలీ అక్బర్‌షాపూర్ జమాన్ జన్మ స్థలమిది.
1916లో పుట్టాడు. పదేళ్ళ వయస్సులో మెహెరాశ్రమం స్కూల్లో చేరిన ధన్యుడు.
యెజ్ద్‌లో ఏకాంతవాసం చేయాలన్నది మెహెరుప్రభుని సంకల్పం.
రెండురోజులపాటు ఎంతగా వెతికినా బాబావారికి నచ్చిన జాగా కనిపించలేదు.
ఇప్పుడు ఏం చేయాలి అన్న మీమాంసలో మండలివారు పడితే,
బాబావారు వాళ్ళ గోడు పట్టించు కోలేదు సరికదా,
బైదుల్ ఇంటికి పోదాం అన్నారు.
అంటే మళ్ళీ జఫ్రాబాద్‌కి వెళ్ళాలి.
ఇప్పుడు ఎందుకబ్బా అంత దూరం అని ఒకరిద్దరికి అనిపించినా
నోరు విప్పలేదు.
అందరూ బాబావారి వెంట జఫ్రాబాద్‌కి వెళ్ళారు.
బైదుల్ భార్య సోల్తాన్, కంగారు పడింది. కాలూ చేయి ఆడలేదు.
పిలవకుండా, చెప్పాపెట్టకుండా పరాత్పరుడే ఇంటికి వస్తే,
ఎవరికి అయినా అంటే కదా. ఇంటి నిండా చుట్టాలు వున్నారు.
బాబావారి రాక వాళ్ళనీ సంభ్రమాశ్చర్యాల్లో పడేసింది.
ఆనాడు అక్కడ జరిగిన సంఘటన కృష్ణావతార కాలంనాటి రెండు సంఘటల్ని

గుర్తుచేసింది. కుచేలుడు తెచ్చిన అటుకుల్ని ఆనందంగా తిన్నాడు కృష్ణుడు.
చిన్ననాటి నేస్తం, ఎన్నో రోజుల తర్వాత తనని వెతుక్కొంటూ వచ్చాడు.
అందుకనో, మరెందుకనో కృష్ణపరమాత్మ అటుకులు తింటుంటే,
అందరూ ఆశ్చర్యపోయారు.
ఈ బడుగు బ్రాహ్మణుడు తెచ్చిన అటుకులు అంత తీయగా వున్నాయా అని ముక్కున వేలు వేసుకొన్నారుట. అటుకలకి కాదు పరవశించింది.
కుచేలుని భక్తికి, ప్రేమకి కరిగిపోయాడు కృష్ణుడు అని ఆనాటి వారికి తెలీదు పాపం.
కురుక్షేత్ర సంగ్రామానికి రంగం సిద్ధం అవుతుంటే, కృష్ణుడు పాండవుల దూతగా కౌరవ సభకి వస్తాడు. చెప్పవలసిన నాలుగు హిత వాక్కులు చెప్పి,
ధర్మరాజు సందేశం వినిపించి విదురుని ఇంటికి వెళ్ళాడు.
వేద వేదాంతాలని ఔపోసన పట్టిన మహా పండితుడు విదురుడు.
ధృతరాష్ట్ర – దుర్యోధనుల కొలువులో వుంటున్న నీతి వాక్యాలు చెప్పడం మరవని, వెనకాడని దిట్ట. కృష్ణుడు పరమాత్ముడని తెలుసు.
అందుకనే భక్తితో అతిథి మర్యాదలు చేశాడు.
అరటి పండు తన నోటిన వేసుకొని అరటి తొక్కని కృష్ణుని చేతిన పెట్టడం,
ఆ యుగావతారుడు ఆనందంగా భుజించడం పాఠకులకి తెలుసు.
భక్తిలో మునిగి తేలుతున్నవాని ఒంటిపై స్పృహ వుండదంటారు.
ఆరాధ్య దైవాన్ని సేవించి తరించే భాగ్యం లభించిదన్న ఆనందంలో తేలిపోతాడు.
ఇదే సంగతి మనకి రామావతార కాలంలో శబరి కథలోనూ కనిపిస్తుంది.
ఈ పురాణ ప్రస్తావన ఎందుకంటే, బైదుల్ సతీమణి సోల్తాన్ మెహెరుని ప్రేమవాహినిలో ఎలా తేలియాడిందో చెప్పడానికే.
ఇంతకీ ఆవాళ ఏమయిందీ అంటే, బాబావారు ఇంటిలో అడుగుపెడ్తూనే ఆకలివేస్తోంది.
వంట చేయమని తొందరపెట్టారు.
చిటికిలో వంట చేసేస్తానంటూ బియ్యం కడిగి పొయ్యి వెలిగించింది.
గిన్నె పొయ్యిమీద పెట్టింది. అన్నం ఉడుకుతోంది.
వంట అయిపోయిందా? అని బాబావారు పదే పదే అడుగుతున్నారు.
ఇంకొంచెం సేపు పడ్తుంది బాబా అంది ఆ ఇల్లాలు.
ఉడికింది చాల్లే, గిన్నె దింపేయి. వడ్డించు అన్నారు. అయ్యో బాబా!
అన్నం సరిగా వుడకలేదు. కాసేపు ఓపిక పట్టండి వడ్డిస్తాను అంది సొల్తాన్.
బాబావారు ఆమె మాట పట్టించుకోలేదు సరికదా, ఆ గిన్నె ఇలా పట్టుకురా అన్నారు.
ఆమె గిన్నె తెచ్చే వరకూ ఓపిక పట్టలేదు. అన్నం గిన్నె చేతిలోకి తీసుకొని,
మండలివారికి వడ్డించారు. బంధువులు కూడా సహపంక్తిని కూర్చొన్నారు.

పాపం! సొల్తాన్! ఇదేమి ఖర్మ బాబా!!
స్వయంగా వండి వడ్డించవలిసింది నేను.
మీరేమో ఉడికీ వుడకని అన్నం వడ్డిస్తున్నారు.
ఏమి పాపం చేసుకొన్నానో ఎప్పుడో ఎవరో అన్నార్తుడికి సరిగా భోజనం
పెట్టి వుండక పోవచ్చు. అందుకని బాబావారు నాకీ శిక్ష వేస్తున్నారని కుమిలి పోయింది.
బాబావారిని వారించాలని ఎంతో ప్రయత్నించింది.
బాబావారు ఆమెకేసి చూస్తే కదా!
ఇంకొంచెం వడ్డించమంటారా అంటూ కొసరి కొసరి అడిగి అన్నం పెడ్తున్నారు.
అన్నం బాగా ఉడికింది కదూ అని బాబావారు అడగడం,
అవును బాబా, భలే బాగా వుడికింది. ఘుమఘుమలాడుతోంది.
సోల్తాన్ చేతివంట భలే బాగుంది అని మండలివారు అనటం,
సోల్తాన్ నోరు వెళ్ళబట్టం, ఔరా!
ఏమి భగవన్మాయ అని బంధువులు ముక్కున వేలు వేసుకోవడం ఒక్కసారే జరిగాయి.
అక్టోబరు 27న బాబావారు, మండలి జఫ్రాబాద్ నుండి ముబార్కా అన్న మరో
ఊరుకి వెళ్ళారు. బువాసాహెబ్ తండ్రి ఫర్దూన్ ఉంటున్నది అక్కడే. ఆయన్ని కలిశారు.
పెద్దాయన సంతోషించాడు. ఇంత దూరంలో వున్న నన్ను వెతుక్కుంటూ వచ్చావా
ప్రభు అన్నాడు. మన బాల గోపిక, ఆఘూ ఆలీ చుట్టాలు కూడా ఇక్కడే,
ఈ బార్కాలోనే వున్నారని చెపితే, వాళ్ళ ఇంటికీ వెళ్ళారు.
ఆఘూ ఆలీని చూసి, వాళ్ళు ఆనందించారు.
చాలా రోజులయింది కదు పిల్లాడు మా దగ్గరే వుంటాడు అన్నారు.
అదేమిటి? బాబావారితో వాడు వెళ్ళాలి కదా అంటే, ఆ సంగతి మాకు తెలియదు,
ఆఘూ మాతో ఇక్కడే వుంటాడు అంటూ ఖరాఖండిగా చెప్పారు.
బాబావారికి వాళ్ళ ధోరణి నచ్చలేదు.
అలాఅని వాళ్ళకి నచ్చచెప్పే ప్రయత్నమూ చేయలేదు కదా, సరే మీ ఇష్టం అన్నారు.
మండలివారు అభ్యంతరం చెప్పేవారే కానీ వాళ్ళనోటికి తాళం వేశారు బాబా.
ఆఘూని ఇక్కడే వుండనీయండి అని మండలికి స్పష్టం చేశారు.
ఆఘూ ఆలీ మరి పరిష్యాలో వుండిపోతే,
ఆలీ అక్బరు, టోటాబా అదే అబ్దుల్లాల సంగతి ఏమిటి?
వాళ్ళు ఇద్దరూ బాబావారితో వుంటారా?
తమ ఇళ్ళకి వెళ్ళిపోతారా? ఈ
చిక్కుముడిని బాబావారే విప్పారు.
ఆలీ అక్బరు, అబ్దుల్లాల తల్లిదండ్రులు కూడా పరిష్యా వాసులు.

ఈ ఇద్దర్నీ వాళ్ళ ఇంటి దగ్గర దింపేయండి అన్నారు.
ఆనాటి సంఘటన గురించి మండలివారు కూడా తమ డైరీలో ఇలా వ్రాసుకొన్నారు.
ముంబాయిలో ఆలీ బాగా నీరసంగా కనిపించాడు, మొహం పాలిపోయింది.
జ్వరంతో వళ్ళు కాలిపోతుంది.
పాపం ఆ కుర్రాడిని అలాంటి స్థితిలో వదిలివచ్చినందుకు బాబావారికి బాధవేసింది.
అయ్యో! పాపం పసివాడు అంటూ కంటతడిపెట్టారు.
ఈ దృశ్యం చూసిన మండలివారికి కళ్ళు చెమర్చాయి.
ధన్యుడివిరా ఆలీ నువ్వు అనుకొన్నారు.
సాక్షాత్తూ అవతార పురుషుడి ప్రేమ వర్షం కురిపిస్తున్నారు నీ మీద.
దొరుకునా ఈ భాగ్యం ఎవరికయినా.
గమ్మత్తు ఏమంటే, బొంబాయిలో ఆఘూ ఆలీ వుండిపోవడానికి బాబావారు ఒప్పుకున్నారన్న సంగతి అతని చిన్నాన్నకి తెలియదు.
అందుకని అతను ఏం చేశాడు?
బాబావారిపై ద్వజమెత్తాడు.
ఈ మాయలమారి మా మాట కాదంటే చిన్నారి ఆలీని తీసుకుపోతానంటాడా అని కోపంతో ఊగిపాయాడు.
ఎదురుపడితే బాబావారిని కాల్చేయాలనుకొన్నాడు.
అనుకోవటమే కాదు ప్లాను వేశాడు ఎలా చంపాలా అని.
పిస్టలు సంపాదించాడు. జేబులోనో, నడుం బెల్టుకో పెట్టుకోలేదు.
పైకి కనబడకుండా, మోకాలి క్రింద భాగంలో దాచాడు.
బాబావారు ఎదురుపడగానే పిస్టలు ఝళిపించి కాల్చేయాలన్నది అతగాడి సంకల్పం.
అయితే ఈ సంకల్పం నెరవేరలేదనుకోండి.
ఓ ఇంతకీ ఏమయిందీ అంటే, బాబావారిని చూడగానే అతని గుండె ఝల్లుమంది.
బాబావారిని చంపాలన్న సంగతి మరచిపోయాడు.
పాదాభివందనం చేశాడు. ప్రభువుకి ఇదేమీ పట్టలేదు సరికదా చిరు దరహాసం చేశారు. ఆశీర్వదించారు.
ఆఘూ ఆలీ చిన్నాన్న పశ్చాత్తాపంతో కృంగి పోయాడు.
పాప పరిహారానికి ఏం చేయాలో తోచలేదు.
ఇంటికి వెళ్ళాక మంచి పళ్ళు బుట్టెడు పంపిస్తే నన్న ఆలోచనవచ్చింది.
వెంటనే మంచి ఖరీదయిన పళ్ళు బుట్టెడు పంపాడు.
ఎడారిలో బాగా పండుతాయి. దొండ పండులా దోరగా వున్నాయి.
ఆల్ బకరా పళ్ళలాగా వున్నాయి. పుల్లపుల్లగా, తీయతీయగా వున్నాయి.

స్థానికులు వీటిని పీచ్ అంటారట.
శ్రీనగర్, ఢిల్లీ, చండీఘర్ వంటి ఉత్తర భారత నగరాల్లో ఎండాకాలంలో దొరుకుతాయి ఈ పళ్ళు. కొంచెం ధర ఎక్కువే. వీటిని "ఆడు" అంటారు మనవాళ్ళు.
బాల గోపికలు త్రయం ఇంటి దారిపట్టినట్లే మన జాల్, మారుతీ పటేల్ ఇండియా దారిపట్టారు. మేము ఖుర్రంషెహర్‌కి వెడతాము.
మీరు ఇండియాకి వెళ్ళండి అని బాబావారే స్వయంగా చెప్పారు వాళ్ళిద్దరికి.
ప్రభువు వాళ్ళని వెనక్కి వెళ్ళమనడం ఒక విధంగా శిక్ష.
ఎందుకు వేశారీ శిక్ష. బాబావారు చెప్పలేదు.
జాల్ కానీ, మారుతీ కానీ – 'మా తప్పేమిటి బాబా' అని అడగలేదు.
ప్రభువు ఆజ్ఞాపించాడు. ఈ భక్తులు శిరసావహించారు అంతే!
వీళ్ళని తిప్పి పంపటానికి కారణం ఏమయి వుంటుంది అని తరచి తరచి ఆలోచిస్తే బహుశా మారుతికి ఇది శిక్ష కాదు ఓ వరం అనిపిస్తుంది.
చలికి తట్టుకోలేకపోతున్నాడు.
ఎక్కడ మద్యం ముట్టమంటారోనని వణికిపోతున్నాడు.
పరిష్యాలో చలికి మందు మాధ్యమం అని జాల్ భయపెట్టాడు కదా మరి.
అందుకనే మారుతిని కనికరించారు పరమాత్ముడు అనుకోవాలి.
నీవెక్కడున్నా నేను వుంటాగా నీ చెంత, నీ కెందుకు చింత అన్న అభయం ఎప్పుడో పంపారు కదా ప్రభువు.
అందువల్ల ఇండియాకి పంపేయడం శిక్ష అనేకంటే మారుతికిచ్చిన వరం అనుకోవచ్చు.
మరి జాల్‌కో? వరమిచ్చారా? శిక్ష వేశారా? ఇది పాఠకులే నిర్ణయించాలి.
సరే, మారుతి, జాల్ ఇంటి దారి పట్టాక బాబావారు ఖుర్రంషెహర్‌కి బయలుదేరారు.
ఆ ఊరి ప్రత్యేకత ఏమిటి అంటే అది బాబా తండ్రి షెరియార్జీ పుట్టిన ఊరు.
తాత గారు మూన్దేగర్ పుట్టినదీ ఆ ఊళ్ళోనే.
మరి అక్కడ అడుగుపెట్టూనే బాబావారు హుషారుగా కన్పించారు.
బాబా సంతోషాన్ని, ఆనందాన్ని మాటల్లో చెప్పలేము.
ఛాన్జీకి కొత్త టోపీ కొన్నారు.
మరి నాకో అని అడగకుండానే విష్ణుకి కొత్త కోటు కొన్నారు.
ఈ రెండు బహుమతులు బాబావారి ఆనందానికి తీపి గుర్తులు కావచ్చు.
సరే ఖుర్రం షెహర్ నుంచి యెజ్డ్‌కి వాపసు వచ్చారు.
ఇక్కడ ఈ ఊళ్ళో ఏకాంతవాసం వుండాలన్నది బాబావారి సంకల్పం.
ఈ సంగతి పాఠకులకి తెలుసు.
అయితే గతంలో లాగా, ఈ సారి కూడా ఎంత వెతికినా సరైన జాగా కనపడలేదు.

ఏంచేస్తాం! ఇంకో ఊరు పోదాం!
ఇక్కడ ఎందుకు అన్నారు బాబా. అందరూ సరేనన్నారు.
అక్టోబరు 28వ తేదీన ఇహ బయలుదేరాలనుకొంటుంటే, స్థానిక స్కూలు ప్రిన్సిపాల్, బాబావారిని తమ పిల్లల్ని ఆశీర్వదించమని కోరాడు.
ఆ స్కూలు పేరు జొరాస్ట్రియన్ మార్కర్స్ స్కూలు.
బాబావారి దర్శనానికి చాలామంది వచ్చారక్కడికి.
బాబావారు అందరికీ తమ ఆశీస్సులు ఇచ్చారు.
మీరెప్పుడు మౌన విరమణ చేస్తారని ప్రిన్సిపాల్ గారు బాబావారిని అడిగారు.
మీ మృధు మధుర వాక్కుని వినే భాగ్యం ఎప్పుడు కల్పిస్తారు అని ప్రశ్నించాడు.
బాబావారు చిరునవ్వు నవ్వారు.
ఆ నవ్వులో వెటకారం కనిపించింది కొందరికి.
మరి కొందరికి ఎందుకీ ప్రశ్న నీకు అంటున్నారా అనిపించింది.
ఎవరి మనోభావాల్నీ పట్టించుకోని బాబాజాన్ ముద్దు బిడ్డడు అక్షర ఫలకంపై తమ జవాబునిచ్చారు. చకచకా బాబావారి చూపుడువేలు కదులుతుంటే అక్షరాలు కూడబలుక్కుని చదివినవాళ్ళకి జవాబు దొరికింది.
మరో నాలుగు నెలల్లో మాట్లాడుతారుట.
అంటే ఇండియాకి వాపసు వెళ్ళాక మౌన విరమణ చేస్తారా? అలాగే అనుకోవాలి.
యెజ్డ్‌లో బాబావారి బస – రుస్తుం ఖుస్రాన్ ఇంటిలో. అతగాడొక బడా వ్యాపారి.
తన ఇల్లు పావనం చేయమనీ, ఆతిధ్యం స్వీకరించి తరింపచేయమని, బాబావారు యెజ్డ్‌కి మొదటిసారి వచ్చినప్పుడే వేడుకొన్నాడు.
ముబార్కా, జఫ్రాబాద్, ఖుర్రం షెహర్‌లకి వెళ్ళివచ్చాక కూడా అతని ఇంటిలోనే దిగారు బాబా, మండలి స్కూలు నుంచి బాబావారు ఖుస్రాన్ ఇంటికి తిరిగి వచ్చారు కాసేపటికి జనం తండోపతండాలుగా తరలి వచ్చారు.
ఎటు చూసినా జన సందోహమే. వీళ్ళ అదృష్టం పండింది.
ఆధునిక జొరాసుత్రుని దర్శనం దొరుకుతుంది వీళ్ళకి అనుకొన్నారు అందరు.
కానీ వీరిది పేరాశ అని బాబావారు చెప్పకనే చెప్పారు.
కాస్తంత ఎంగిలిపడి వెళ్ళమని చెప్పినా వినిపించు కోలేదు సరికదా వెనుక గుమ్మాన బయటపడి, కార్మాన్ దారి పట్టారు.
బాబావారు వెళ్ళిపోయారు. తెలిసి హతాశులయ్యారు నగరవాసులు.
అయ్యో! కనీసం దూరం నుంచి అయినా చూసే అదృష్టానికి నోచుకోలేదే అని కొట్టుకు పోయారు. కొంతమందికి అయితే దు:ఖం పొంగుకు వచ్చింది.
సద్గురు సందర్శన భాగ్యం కోల్పోయామని తల్లడిల్లిపోయారు.

యెజ్ద్ నుండి బాబావారు కేర్మాన్ నగరం చేరే సరికి ఉదయం తొమ్మిది అయింది.
ఈ ఊళ్ళో ఉండాలని లేదు. దర్శనం ఇవ్వాలని లేదు అని బాబావారు స్పష్టం చేశారు.
తమని కలవడానికి ఎవరూ రాకుండా చూడండి అన్నారు.
ఊళ్ళోకి అడుగుపెడ్తూనే, బాబావారు కార్లని గారేజ్‌కి తీసుకువెళ్ళమన్నారు
కారు గారేజిలో వుంటే ఎవరికీ కనబడదు కదా.
బాబావారు వచ్చిన వైనం ఎవరికీ తెలీదు.
అందుకని కారు గారేజ్‌లోనే ఉంచమన్నారు.
బాబావారు, మండలి దిగారు. తలుపుకి గడియ పెట్టారు. ఇలా ఇన్ని జాగ్రత్తలు తీసుకొన్నా
బాబావారి రాకని రుస్తుం సొహరాబ్ ఇరానీ పసిగట్టాడు.
డబ్బున్న ఆసామి అతగాడు. ఇండియా నుండి వచ్చిన మాహాత్ముడు కారు గ్యారేజీలో
వుండటం ఏమిటి అనుకొన్నాడు. ఆ మాటే బాబావారితో అన్నాడు.
నా ఆతిథ్యం స్వీకరించు స్వామి? మీకే లోటు రాకుండా సకల మర్యాదలు చేస్తాను
నా ఇంట భోగభాగ్యాలకి కొదవ లేదు అని సవినయంగా విన్నవించాడు.
బాబావారు అతని మాటని త్రోసిపుచ్చారు. తమకి ఇక్కడే కారు గ్యారేజిలో బాగుందన్నారు.
అయితే రుస్తుం గారు తమ పట్టువదలలేదు.
ఒక్కసారి రండి బాబా నా ఇంటికి ఎవరి కంటా పడకుండా మిమ్మల్ని తీసుకు వెళ్ళే
బాధ్యత నాది. నా మాట నమ్మండి ప్రభూ! అన్నాడు.
సరే, నీ ఇష్టం అన్నారు బాబావారు.
కానీ, అనుకొన్నది ఒకటి, అయ్యింది మరొకటి. బాబావారు వచ్చారన్న వార్త ఇట్టే
పొక్కింది. బాబావారి గ్యారేజ్ దగ్గరకి జనం తండోపతండాలుగా వచ్చారు.
జనం ఎంతగా వచ్చారంటే, పోలీసుల్ని పిలిపించాల్సి వచ్చింది.
జనాన్ని అదుపు చేయడానికి పోలీసులకి చాలా కష్టమయింది కూడా!
బాబావారు ఎంతగా గోప్యం, గోప్యం అంటున్నా శ్రీవారి ఉనికి నలుగురికి ఎలా
తెలుస్తోంది? ఇదేమీ చిక్కుప్రశ్న కాదు పాఠకమహాశయా!
ఎందుకని అంటే, మెహెరీశుడు యెజ్ద్‌కి రావడం, అక్కడ ప్రభు గౌరవార్థం కార్యక్రమం
ఏర్పాటు కావడం ప్రజలు బాదులు తీరడం దర్శనానికి సంచలన వార్త అయింది.
మెహెరీశ్వరుడు పరిష్యా యాత్రలో వున్నారన్న సంగతి నలుగురికీ తెలిసింది.
అంతే ఏ ఊరు వెళ్ళినా, ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా ప్రభు దర్శనానికి ప్రజలు వస్తున్నారు.
ఆనాటి ఇరాన్ చక్రవర్తి రెజాషావారు ఈ మహాత్ముడిని కలిస్తే ఎలా వుంటుంది?
భేషుగ్గా వుంటుంది అని తలచుకొందురు. అంతే మెహెరు – రేజాల సమావేశం
ఏర్పాటు చేయాలని వువ్విళూరారు. వాళ్ళ ప్రయత్నం ఫలించలేదనుకోండి.
ఎందుకు అంటే, బాబావారు ఆ ప్రతిపాదనని నిర్ద్వంద్వంగా కొట్టేశారు.

కేర్మాన్‌లో ఓ రోజున్నాకే జామ్ అన్న మరో ఊరికి బయలుదేరారు.
ఆవేళ అక్టోబరు 30వ తేదీన కొంత దూరం వెళ్ళాక ఆకలేస్తోంది ఏదైనా వండమన్నారు మాసాజిని. అతగాడు రోడ్డు ప్రక్కనే స్టౌ వెలిగించాడు. బియ్యం అయితే వున్నయి కానీ కూరలు లేవు. ఇది ఎవరి నిర్వాకం అని బాబావారు గదమాయించారు.
ఇరాన్ చక్రవర్తికి మెహెరుని గురించి ఎవరైనా చెప్పి వుంటారా?
ఫలానావారు చెప్పారని చరిత్రలో నమోదు కాలేదు.
కల్నల్ ఇరానీ గారు బాబా గురించి చెప్పి వుండవచ్చని ఊహాగానం వుంది.
ఎందుకంటే రెజాఫహల్ పట్టాభిషేకం (ఏప్రిల్ 1926)కు ఇండియా నుండి జొరాష్ట్రియన్లు కొంతమంది వెళ్ళారు. ఆ బృందంలో ఇరానీగా అప్పట్లో కల్నల్ ఇరానీ గారు వున్నారు.
బాబా అంటే బద్ద వ్యతిరేకి. ప్రయాణం ఏర్పాట్లు, వంటవార్పు ఏర్పాట్లు రావ్‌సాహెబ్ బాధ్యత. మరి అతగాడు పరిష్యా యాత్రకి మానేశాడు కదా.
అందుకని అతనిపై బాబావారు ధ్వజమెత్తారు. దులిపేశారు.
ఇలాగేనా ఏర్పాట్లు చేసేది అని నిలదీశారు. రావ్‌సాహెబ్‌కి ఉక్రోషం పొంగుకొచ్చింది.
ఉంబడట్టలేక మనస్సులో మాట అనేశాడు.
నేనెంతగా మొత్తుకున్నా మీరు నా మాట పట్టించుకోలేదు.
యెజ్డ్‌లో చెప్పాను కెర్మాన్‌లో మళ్ళీ చెప్పాను బంగాళదుంపలు, పండ్లు కొంటానన్నాను.
పెరుగు, వెన్న, బ్రెడ్ కొందామన్నాను. మీరెమో నా మాట పడనిచ్చారు కాదు.
ఈ దారిలో తినడానికి ఏమీ దొరకవని నాకు ముందే తెలుసు.
అందుకనే కనీసం బ్రెడ్ కొందామని పదే పదే చెప్పాను.
అప్పుడేమో నా మాట పట్టించు కోలేదు.
ఇప్పుడేమో ఆకలి, ఆకలి అంటే నన్నేం చేయమంటారు?
ఇక్కడేం దొరుకుతుంది. ఎండుగడ్డి, పచ్చి గడ్డి తప్ప. అవే పెట్టమంటారా?
రావ్‌సాహెబ్ గొంతు జీరపోయింది. బాబావారి ముందు అతనెప్పుడూ పెదవి విప్పలేదు.
కానీ ఈవేళ బాబావారినే తప్పుపడుతున్నాడు. ఇదిగో ఇది నా నిర్వాకం కాదు.
మీ నిర్వాకం అంటున్నాడు కోపంతో, బాధతో. అయ్యో! నా ప్రభువు నోరు తెరిచి ఆకలి అంటుంటే, పట్టెడు అన్నం పెట్టలేకపోతున్నానన్న బాధ అతని ప్రతి మాటలో కనిపిస్తోంది.
కనీసం బ్రెడ్ వున్నా బాగుండేది. ఇంత వెన్న రాచి పెట్టేవాడిని.
బ్రెడ్ కొననివ్వలేదు. వెన్న లేదు.
ఇప్పుడు ఈ అడవిలాంటి చోట నిర్జన ప్రదేశంలో బాబావారి ఆకలి తీర్చడం నావల్ల కాదే! నా దగ్గర అక్షయపాత్ర లేదే!

**– సశేషం**

# అవతార్ చాలీసా




శ్రీమతి మోటమఱ్ఱి శివనాగేశ్వరి ప్రసాద్ గారు **'అవతార్ చాలీసా'ను** రచించి, ముద్రించి ఇటీవల బాబా ప్రేమికుల కోసం ప్రత్యేకంగా విడుదల చేశారు. **"షిర్డి వాసా సాయి ప్రభో జగతికి మూలా నీ వే ప్రభో"** వరుసలో 40 చరణాలతో రాశారు.

మెహెర్ చాలీసా పఠించాలనుకొనేవారికి ఇదొక అందివచ్చిన అవకాశం. చాలీసాతో పాటు క్లుప్తంగా బాబావారి జీవిత చరిత్ర, ప్రార్థనలు, పలు ఆరతులు ఈ చిన్న పుస్తకం ద్వారా అందజేసే ప్రయత్నం ఆమె చేశారు.

పుస్తకం వెల రూ. 5/-. ఈ పుస్తకాలు అమ్ముడుపోగా వచ్చే నగదును అవతార్ మెహెర్‌బాబా జూబ్లి సెంటర్ అభివృద్ధికి అందజేయనున్నామని ఆమె ప్రకటించారు.
ప్రతులకు శ్రీమతి శివనాగేశ్వరి, ఇంటి నెం. 8-3-976/24, రాఘవ, శాలివాహన నగర్, హైదరాబాద్-73, ఫోన్: 94404 43049 సంప్రదించగలరు.

# రాజాం

రాజాం అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 27వ వార్షికోత్సవం శ్రీ వేంకటేశ్వర కళ్యాణమండపంలో జరిగింది. ఉ. 7 గం.లకు మెహెర్‌బాబావారి చిత్రపటంతో రాజాం నగర పురవీధులలో ఊరేగింపు, అనంతరం రాజాం నగర పంచాయితీ కమీషనరు శ్రీ డి. శ్రీనివాసరావు గారిచే సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. ఆ పిదప ప్రేమికా సహవాస్ శ్రీ ఆర్. బాణేశ్వరరావు గారి నిర్వహణలో జరిగినది.
ఈ కార్యక్రమములో శ్రీ బాలగోపాల మెహెర్ ఈశా, శ్రీ బి.వి. రమణ బాబా సందేశాలపై ప్రసంగించారు. మెహెర్ శ్రీ బృందం బాబా సంకీర్తనలు ఆలాపించినట్లు కార్యదర్శి శ్రీ పి.వి. రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐవీ ఒనైటా డ్యూస్



ఈమె పూర్తి పేరు ఐవీ ఒనైటా డ్యూస్. అమెరికాలోని న్యూయార్క్ నివాసి.

ఐతే, ఈమెని ఐవీ డ్యూస్ అనీ, క్లుప్తంగా ఐవీ డ్యూస్‌గా బాబా ప్రేమికులందరికీ సుపరిచితురాలు. బాబా పుట్టినరోజునాడు అంటే ఫిబ్రవరి 25న జన్మించింది. ఆమె జననం 1895 ఫిబ్రవరి 25న. న్యాయశాస్త్రం చదివిందామె. చక్కని గాత్రం ఆమె సొంతం. దక్షిణ అమెరికాలో ఒక ఆయిల్ కంపెనీ ఇంజనీర్‌కు **"లా"** కార్యదర్శిగా పనిచేసింది. ఆ దరిమిలా ఆయిల్ కంపెనీలోని సహోద్యోగి **'డ్యూస్'** అనునతడిని వివాహమాడింది. న్యాయశాఖలో ఉన్నతాధికారిగా ఆమె అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించింది. ఆమె ఎంతటి ఉన్నత ఉద్యోగంలో వున్నా మనస్సు మాత్రం ఆధ్యాత్మికత వైపే మొగ్గు చూపింది. తొలినాళ్ళలో జోతిష్యం, వాస్తు ఇతరత్రాల వైపు ఆకర్షితురాలయింది. కొంతమంది ఆధ్యాత్మిక గురువుల్ని ఆశ్రయించినా, సూఫీ మత గురువు **రబియా మార్టిన్** ఆశ్రమంలో సూఫీ విద్యార్థిగా చేరింది. న్యూయార్క్‌లో వున్న కొంతమంది బాబా ప్రేమికుల ద్వారా రబియా మార్టిన్ మెహెర్‌బాబా గురించి తెలుసుకుంది. ఆమె మెహెర్‌బాబాను సాక్షాత్తూ ఈ యుగావతారునిగా స్వీకరించి, ఆమె తన దగ్గరున్న అనేక మంది శిష్యుల్ని మెహెర్‌బాబావారిని అనుసరించమని కోరింది. ఆ మాదిరిగా తన సూఫీ గురువు రబియా ద్వారా ఐవీ డ్యూస్ మెహెర్‌బాబా పరిధిలోకి వచ్చిందని చెప్పొచ్చు. రబియా మార్టినా శిష్య పరంపరలో ఐవీతోపాటు

**లడ్ డిమ్‌ఫి, డాన్–ఇ–స్టీవెన్స్, సామ్యూల్, లూయిస్** ఇలా చాలామంది మెహెర్‌బాబాను దర్శించుకుని ఆయన సేవలో అంకితమయ్యారు. రబియా మార్టినా మాత్రం మెహెర్‌బాబాను దర్శించుకోవాలని ఎంత తహతహలాడినా అది ఆమెకు సాధ్యపడ లేదు. రబియా తర్వాత తన స్థానాన్ని – సూఫీ గురువుగా ఐవీ డ్యూస్‌ను నియమించింది. సూఫీ గురువుని **ముర్షిదాగా** సంభోదిస్తారు. న్యూయార్క్‌లో వున్న బాబా సెంటర్‌ను ఐవీ డ్యూస్ తరచు హాజరయ్యేది. ఆ పిదప 1948 జనవరిలో మెహెర్‌బాబాను తొలిసారిగా మెహెరాజాద్‌లో దర్శించుకుంది. బాబా నవజీవన యాత్రకు సన్నద్ధమవుతున్న సమయమది. ఆ సమయంలో బాబావారి ఆశ్రమంలో పాశ్చాత్య బాబా ప్రేమికులు ఎలిజబెత్ పీటర్‌సన్, నోరినా మాచ్‌బెలి తదితరులున్నారు. మెహెర్‌బాబా తొలిసారిగా దర్శించుకున్న సమయంలో ఐవీ డ్యూస్ తన అనుభవాలను **HOW A MASTER WORKS** తన స్వీయ రచనలో స్పష్టంగా చెప్పింది.

అవతారుడి అనంత ప్రేమ, తన హృదయానికి నేరుగా తాకిన అనుభవాన్ని బాబా తనకందజేశారని ఐవీ తన స్వీయ చరిత్రలో పేర్కొనింది.

బాబావారి ఆశ్రమంలో వుండగా ఓ రోజు నేను కొన్ని ఫోటోలు చూస్తున్నాను. ఫోటోలు చూస్తున్నాను కానీ, నా మనస్సు మాత్రం హద్దులు దాటి ఎటో వెళ్ళిపోయింది. దాంతో ఒక మొనదేలిన బాణం వేగంగా వచ్చి నా హృదయాన్ని తాకినట్లైంది. నేను దూరంగా వెళ్ళి ఓ కూర్చీలో కూలబడ్డాను.

నా గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. ఒక్క క్షణం ఉక్కిరిబిక్కిరయ్యాను. కళ్ళంబడి నీళ్ళు ధారలు కట్టాయి. ఈ సమయంలో బాబా నా గదిలోకి వచ్చారు. నా నుదిటన అభయమిస్తున్నట్లు తన అమృత హస్తముంచారు. పిట్యుటరీ గ్రంధి వుండే ప్రాంతంలో నా నుదిటన బాబా ముద్దాడారు. ఆ సమయంలో నా హృదయం నిండా బాబాను తప్పించి మరెవ్వరూ లేని స్థితిని అనుభవించాను.

అలా కొద్ది క్షణాలుండిపోయానని, బాబాతో తన తొలి దర్శన అనుభవాలను ఐవీ పలుమార్లు బాబా ప్రేమికులకు చెప్పారు.

ఐవీ సూఫీ మత గురువు కదా!! ఆమెతో బాబా మాట్లాడుతూ,

తానేదో గొప్ప సన్యాసినని ప్రకటించుకోకుండా, నిజాయితీతో బాబాకు విధేయతతో అంకితమయినంత కాలం బాబా తన సహాయం తప్పక అందిస్తానని చెప్పారని, ఒక పత్రికా విలేఖరికిచ్చిన ఇంటర్వ్యూలో ఐవీ స్వయంగా చెప్పింది.

**సూఫీయిజమ్ రీ ఓరియంటెడ్** సంస్థ స్థాపనకు బాబా ఆమెకు అనుమతించారు. ఈ విషయమై బాబాతో నేరుగా ఉత్తర ప్రత్యుత్తరాలకు, తగిన సలహాలు అందుకోవడానికి ఆమెకు అనుమతించారు. మెహెరాబాద్ నుండి అమెరికా తిరిగి వచ్చాక ఆమె న్యూయార్క్‌లో సూఫీయిజమ్ రీ ఓరియెంటెడ్ సంస్థను నెలకొల్పింది. ఆ సమయంలో



స్థానిక బాబా ప్రేమికులు తమ బాబా సెంటర్‌కు రమ్మనమని ఆమెని ఆహ్వానించారు. మెహెరాబాద్‌లో తన అనుభూతులు, అనుభవాలను వివరించమని కోరారు. ఐతే, బాబా ప్రేమికులు తనను గురువుగా అంగీకరిస్తే, స్థానిక బాబా సెంటర్‌కు తప్పక వస్తానని, లేదంటే తాను రాలేనని చెప్పింది. అందుకు బాబా ప్రేమికులు కూడా గట్టిగానే జవాబిచ్చారు. మేం మెహెర్‌బాబాని తప్పించి, అన్యులెవరినీ గురువుగా అంగీకరించలేమని తేల్చిచెప్పారు. కొద్ది రోజుల తర్వాత ఐవీ డ్యూస్ మనస్సు మార్చుకుంది. ఒకరోజు సాయంత్రం బాబా సెంటర్‌కు వచ్చింది. మేమందరం హాయిగా ఎలాంటి అరమరికలు లేకుండా బాబా కబుర్లు చెప్పుకున్నామన్నారు బాబా ప్రేమికులు. ఐతే, న్యూయార్క్‌లో సూఫీఇజమ్ రీ ఓరియంటెడ్ కేంద్రాన్ని ఐవీ నెలకొల్పిందని చెప్పుకున్నాం కదా!!
ఆ కేంద్రానికి బాబా ప్రేమికుల్ని ఆహ్వానించి, వారినీ సూఫీయిజమ్ వైపు ఆకర్షితుల్ని చేసింది. కొందరు ఆ వలలో పడ్డారు. సూఫీయిజమ్ స్వీకరించారు.
తద్వారా తిరిగి ఇరుపక్షాల నడుమ భిన్నాభిప్రాయాలు, మనస్పర్ధలు తలెత్తాయి. అనేకమంది మనుష్యులున్నట్లుగానే భిన్న మతాలు, భిన్న మతాలకు సంబంధించి ఆచార వ్యవహారాలుంటాయని సర్ది చెప్పుకోబోయినా, సూఫీలు అంగీకరించ లేదు. ఈ విషయం బాబాకు తెలియంది కాదు కదా!! 1956లో బాబా మెహెర్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంలో ఇరుపక్షాలకు చెందిన ప్రేమికులను సమావేశపరిచారు. అనంతరం మాట్లాడుతూ, బాబా తన రెండు హస్తాలను గాలిలో పెట్టి సంజ్ఞలతో ఇలా అన్నారు. నా ఎడమ చేయి, కుడి చేతిని కొట్టడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. బాబావారి ఈ పర్యటన మొత్తాన్ని ఐవీ వీడియో చిత్రీకరణ చేసింది. అంతక్రితం 1952లో బాబా న్యూయార్క్ నగరాన్ని సందర్శించారు.
ఆ సమయంలో ఐవీ తనతోపాటు తన శిష్యుల్ని అనేకమందిని బాబాకు పరిచయం చేసింది. ఆ క్రమంలో ఆస్ట్రేలియన్ కవి పండితుడిగా గుర్తింపుపొందిన బాబా మండలి

సభ్యుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ తొలిసారిగా మెహెర్‌బాబాను ఆ సూఫీ బృందంతో దర్శించుకున్నాడు. ఆ తర్వాత ఆయన సూఫీయిజమ్‌ని వదలి శాశ్వతంగా అవతారుడి మండలి సభ్యునిగా చేరిన సంగతి పాఠకులకు తెలుసు. మెహెర్‌బాబా అమెరికా పర్యటనలో వుండగా ఒక్లహోమా ప్రాంతంలో ఘోర కారు ప్రమాదం జరిగింది. మెహెర్‌బాబాతోపాటు కారులో ప్రయాణిస్తున్న ఎలిజెబెత్, మెహెరా తదితరులకు పెద్ద ఎత్తున గాయాలయ్యాయి. బాబాతోపాటు వరుస కార్లలో ప్రయాణిస్తున్న వారు జరిగిన ప్రమాదాన్ని చూసి గొప్ప షాక్‌కు గురయ్యారు. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనను చూసి చాలామంది భయభ్రాంతులయ్యారు. క్రీస్తుగా భావిస్తున్న అవతారుడికి జరిగిన ఈ ఘోర కారు ప్రమాదం షాక్ నుండి వారు వెంటనే తేరుకోలేకపోయారు. ఈ పరిస్థితిని గమనించిన బాబా ఐవీ కోసం కబురు పంపారు. ఆ ఆపద సమయంలో ఐవీ తన కుమార్తె **చార్మియన్** తీసుకుని హుటాహుటిన ఒక్లహోమా చేరుకుంది. బాబా బృందానికి ఐవీ అనన్య సామాన్యమైన సేవలందించిందని బాబా స్వయంగా ఆమెను అభినందించారు. రక్తపుమడుగుల్లో వున్న బాబావారి దుస్తులు చూసి, నా వెన్నులోంచి చలి తన్నుకొచ్చిందని ఐవీ ఆనాటి దృశ్యాన్ని వర్ణించింది. ఆ దరిమిలా ఐవీ – ఆమె కుమార్తె బాబావారిని, గాయపడ్డ మండలివారిని ఆసుపత్రులకు –డాక్టర్ల దగ్గరకు తమ కారులో తీసుకెళ్ళారు. ఈ సందర్భాన్ని...పాశ్చాత్య వైద్యులకు బాబా ఒక ఆధ్యాత్మిక ప్రగతి కల్పించారని ఐవీ వ్యాఖ్యానించింది.

హాఫీజ్, రూమీ, కబీర్ – ఇలా పలువురు సూఫీ గురువులు గురించి నాటి సమాజానికి బాగా తెలుసు కానీ చాలామందికి సుఫీయిజం గురించి సరైన అవగాహన లేదు. న్యూయార్క్ నగరంలో 1952–56 ప్రాంతంలో సూఫీలతో పాటు అనేక ఇతర ఆధ్యాత్మిక సంస్థలున్నాయి. ఎవరి సంస్థ గొప్ప వారిదే సుమీ!! పొరపాటున మెహెర్‌బాబా ఈ యుగావతారుడు, క్రీస్తు ఈ అవతారకాలంలో మెహెర్‌బాబాగా అవతరించాడని చెబితే, గట్టి ప్రతిఘటననే ఎదుర్కొన్నామని నాటి బాబా ప్రేమికులు చెప్తారు.

ఈ విషయమై బాబా స్వయంగా ఇలా చెప్పారు. మీకు నా ఎడల గల ప్రేమ వల్ల మీరు నా దగ్గరకు రాగల్గారు. నాకు – మీకు – ఆ బంధం లేకపోతే, ఎవరెన్ని చెప్పినా, ఎన్ని గ్రంథాలు మీరు చదివినా నా దగ్గరకు మీరు రాలేరని అన్నారు.

1956లో బాబా శాన్ ఫ్రాన్సిస్‌కో పర్యటించారు. అక్కడున్న సూఫీ కేంద్రానికి బాబాను ఐవీ ఆహ్వానించింది. బాబాతోపాటు కొంతమంది మండలి ప్రేమికులు కూడా వెళ్ళారు. నా ఇచ్ఛ ప్రకారం ఐవీ నడుచుకుంటుంది. ఆమె నా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని బాబా ఆమె చేసే కార్యక్రమాలను కొనియాడారు. మెహెర్‌బాబా స్వయంగా రాసిన **భగద్వచనం, మెహెర్‌బాబా ప్రవచనములు** గ్రంథాలను ముద్రించే బాధ్యత బాబా ఐవీకి అప్పగించారు.

ఈ పుస్తకాలను ముద్రించే బాధ్యతతోపాటు, డాన్ స్టీవెన్సెసన్, ఐవీలకు ఈ గ్రంధాల సంపాదకత్వ బాధ్యత కూడా బాబా అప్పగించారు.
1956లో బాబా అమెరికా పర్యటనలో ఇచ్చిన సందేశాలను
**"BEAMS"**
**"LIFE AT ITS BEST"**
గ్రంధాలను ఆమె పబ్లిష్ చేశింది.
ఈమె తన జీవిత చరిత్రను, బాబావారి సందేశాలతో కూడిన గ్రంధం
**"HOW A MASTER WORKS"** శీర్షికతో ముద్రించి
బాబా ప్రేమికలోకానికి అందజేశింది.
1959లో బాబాను ప్రత్యేకంగా దర్శించుకునేందుకు ఐవీకి,
ఆమె శిష్యులకు అనుమతించారు.
తిరిగి 1962లో పూణేలో ఏర్పాటు చేసిన ప్రాక్‌పశ్చిమ సమావేశాలకు కూడా
ఐవీ హాజరయింది. 1969లో బాబా భౌతిక దేహం వదిలిన
సమయంలో కూడా ఐవీ తన శిష్య పరంపరతో కల్సి బాబావారి దర్శనం చేసుకుంది.
ఐవీ తన సహజ చతురతతో అందరినీ ఛలోక్తులతో నవ్వించేది.
ఆమెది దయగల హృదయం. సూఫీయిజం ప్రారంభించిన **ఇనాయత్‌ఖాన్** తన వారసురాలిగా **రబియా మార్టిన్‌ని** నియమించాడు. రబియా తన తదనంతరం ఐవీని, తిరిగి ఐవీ, సైకాలజిస్టు, డా॥ జీమ్స్ మేకీని తన స్థానంలో
**ముర్షిదా – సూఫీ గురువుగా** నియమించింది.
నిరంతరం బాబా నామస్మరణలో, సేవలో తరించిన
ఐవీ 1981 అక్టోబరులో తుదిశ్వాస వదిలింది.
బాబాలో ఐక్యమయ్యింది!! ఆమె రచనలు నేటికీ స్ఫూర్తిదాయకం!!

# రచనలకు ఆహ్వానం

బాబా సందేశాలపై, మీకు నచ్చిన అంశాలపై మీ రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ ప్రాంతాల్లో జరిగే సహవాస్ కార్యక్రమ వివరాలను కూడా మా చిరునామాకు పంపండి. మీ సమాచారం మాకు ప్రతి నెలా 5వ తేదీ లోగా అందేలాగా పంపవల్సింది. **మా చిరునామా..**ఎడిటర్, బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్, ప్లాట్ నంబరు 32, యాప్రాల్, సికింద్రాబాద్ – 500 087.
ఫోన్ 99595 53218. **ఇ-మెయిల్.** malladisukku@gmail.com.

# ఆంధ్రా రెస్టుహౌస్

2016 జనవరి 30, 31 ఫిబ్రవరి 1వ తేదీలలో మెహెరాబాద్‌లో బాబావారి అమరతిథికి హాజరయ్యే బాబా ప్రేమికులకు ఆంధ్రా రెస్టుహౌసు సాదర స్వాగతం పలుకుతోంది. కాగా, అమరతిథికి హాజరుకాగోరు బాబా ప్రేమికులు ఆంధ్రా రెస్టుహౌసులో భోజన / వసతి సౌకర్యాలు కోరువారు తమ వివరాలు త్వరలో పంపి ముందుగా రిజర్వు చేసుకోవల్సిందిగా కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ కోరుతున్నారు.

# బాబాలో ఐక్యం

శ్రీమతి మలకపల్లి లక్ష్మి, గోపాలపురం, నల్లజర్ల మండలం, 12.10.2015 ఉ. 7.30 ని.లకు బాబాలో ఐక్యమయ్యారు. నిరంతరం అవతారుని నామస్మరణలో గడిపే శ్రీమతి లక్ష్మి గారు అక్టోబరు 12 ఉదయం 7 గం.లకు బాబా ప్రార్థనలు చేసుకుని స్వల్ప అస్వస్థతతో ఆసుపత్రికి బయలుదేరి బాబా నామస్మరణతోనే తుదిశ్వాస వదిలారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. అవతారుని 'శబరి' వంటిదని మేము ఆమెను సంభోదిస్తామని గోపాలపురం సెంటర్ సభ్యులు తెలిపారు.

# నిజామాబాద్

నిజామాబాద్‌లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గల మెహెర్‌బాబా సెంటర్ 52వ వార్షికోత్సవం సందర్భంగా 25.10.2015 ఉ. 8 నుండి సా. 6 గం.ల వరకు ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ ఎ. జనార్ధనరావు (99087 85774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవలిసినదిగా ఆయన కోరుతున్నారు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, **995 955 3218**ని సంప్రదించగలరు.

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2015 సెప్టెంబర్-అక్టోబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | సెప్టెంబర్ | పరాంకుశం శ్రీనివాసరావు, గుంటూరు | రూ. 500.00 |
| 2. | సెప్టెంబర్ | ఎ. పరిపూర్ణాచారి, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 3. | సెప్టెంబర్ | బి.జె. రావు, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 4. | సెప్టెంబర్ | పి. మెహెర్‌బాబు, కర్నాటక | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 3000.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973,**
**IFSC CODE: IOBA 0001732.**

వార్షిక సభ్యత్వం కోరువారు, రూ. 100/- (నూరు రూపాయలు) ఈ దిగువ అడ్రస్సుకు పంపవలెను.

**మా అడ్రస్:**

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,
బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218. **email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month, Posted at Patrika Channel on 19 / 20th every month.